


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 363, పేజీలు - 08
సోమవారం, జూన్ 22, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ప్రశాంతంగా నీట్-యూజీ పునఃపరీక్ష

## ఇక ఫలితాలపైనే అందరి దృష్టి!

- ఫిజిక్స్ కఠినంగా, బయాలజీ సులభంగా ఉందన్న విద్యార్థులు
- దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు
- జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా
- జూలై చివరి వారంలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశం





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ 2026 రీ-ఎగ్జామ్ విజయవంతంగా ముగిసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారికంగా ప్రకటించింది. మన దేశంలోని 5,440 కేంద్రాలతో పాటు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. హిందీ, ఇంగ్లిష్తోపాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్ష జరిగిందని ఎన్టీఏ పేర్కొంది. దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి వల్లే ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించగలిగామని ఎన్టీఏ తెలిపింది. ఈ పరీక్షలో 10వేల మందికిపైగా దివ్యాంగులైన అభ్యర్థుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశామంది. అలాగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న సుమారు 81 మంది అభ్యర్థుల కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేసినట్లు వెల్లడించింది. వీరిలో రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్న ఒక విద్యార్థి, అలాగే కీమోథెరపీ చికిత్స పొందుతున్న మరొక

2లో..

# రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

## మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ




కోల్కతా (ప్రశ్న న్యూస్) భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి.

2లో..

# తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లను

- నా సీటును బీజేపీ చోరీ చేసిందన్న మీనాక్షి
- మధ్య ప్రదేశ్ నుంచే రాజకీయాలు చేస్తానని ప్రకటన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి తాను దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ప్రస్తుతం ఎలాంటి లీగల్ కేసులు లేవని, చట్టబద్ధంగా తాను అన్ని నిబంధనలను పాటించానని స్పష్టం చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఒక పాత కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్లో పేర్కొనలేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికార బీజేపీ, ఈసీ లాలూచీపడి, కుట్రపూరితంగా తన నామినేషన్ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తన రాజ్యసభ

2లో..

# రాహుల్ గాంధీతో సమావేశం ఏర్పాటు చేయండి

- సీఎం రేవంత్ రెడ్డికి రామచందర్ రావు లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో దారుణంగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై నిలదీసేందుకు, తెలంగాణ ప్రజల గోడును నేరుగా వినిపించేందుకు..

2లో..

# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

## - ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా సీఎం నిర్ణయం

- గతంలో విడుదల చేసిన 7 శ్వేతపత్రాల తరహాలోనే ఈ నివేదికల రూపకల్పన
- రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ఎలా నడిపించామో స్పష్టం చేయాలని సూచన
- అసత్య ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై 'ప్రోగెస్ రిపోర్ట్ 2024-26' పేరుతో విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులను ఆదేశించారు. 2024లో అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసంపై ఇచ్చిన 7 శ్వేత పత్రాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులా ఈ ప్రోగ్రెస్ రిపోర్టులు ఉండాలని సీఎం అన్నారు. 7 శ్వేత పత్రాలతో పాటు మరో 3 ముఖ్యమైన అంశాలపై ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి

2లో..

# సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం

- దర్యాప్తునకు ఐజీ రవి ప్రకాశ్ నేతృత్వంలో 'సిట్' ఏర్పాటు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల విభాగం ఇన్స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్కు నేతృత్వం వహించనున్నారు. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ

2లో..

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

- ఆరోపణలను ఖండించిన సింగరేణి
- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం
- 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో నిజం లేదని ప్రకటన
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో తెరపైకి వచ్చిన బొగ్గు గల్లంతు ఆరోపణలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

2లో..

# హెల్దీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా యోగాసనాలు

- బాబా రామ్దేవ్తో కలిసి చంద్రబాబు, లోకేశ్ యోగాభ్యాసం
- రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా యోగా సాధన
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని సీఎం ప్రకటన
- ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు




అమరావతి (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా

2లో..

# ఈ ఒక్క సంవత్సరం మీ ఇండ్లను కాపాడుకోండి

## నెక్స్ట్ వచ్చేది మన ప్రభుత్వమే




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదు. అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను 'గుంపు మేస్త్రి'అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్ బస్తీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. గత 60 సంవత్సరాలుగా ఆ బస్తీలో నివాసం ఉంటున్న పేద ప్రజలను అక్కడి నుండి తరలించి, ఆ భూములను అమ్ముకోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతున్న నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయింది.కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

2లో..

# భారత్ ఇంధన భద్రతకు భారీ ఊరట

## - హర్మూజ్ దాటిన 3 ఆయిల్ ట్యాంకర్లు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూడు భారతీయ జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఈ జలమార్గంలో రవాణా తిరిగి ప్రారంభం కావడం భారత్కు శుభపరిణామం. ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా ప్రకటించారు. 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు

2లో..

# ప్రశాంతంగా నీట్-యూజీ పునఃపరీక్ష

విద్యార్థి కూడా పరీక్షకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొంది.

### భారీ భద్రత ఏర్పాట్లు

పరీక్షను పారదర్శకతను పెంచేందుకు, భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్, ముఖ గుర్తింపు విధానాన్ని ఉపయోగించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీ మానిటరింగ్, సిగ్నల్ జామర్లు, రాష్ట్ర పోలీసుల సహకారంతో రెండు అంచెల తనిఖీలను అమలు చేశారు. సీసీటీవీ విజువల్స్ను నిరంతరం పర్యవేక్షించేందుకు ఎన్టీఏ ప్రధాన కార్యాలయం, విద్యామంత్రిత్వశాఖ, ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 34 కేంద్ర విద్యా సంస్థలు, అలాగే అన్ని రాష్ట్రాలు, జిల్లా కలెక్టరేట్లలో 'కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు' ఏర్పాటు చేశారు.

### 20 లక్షలకు పైగా హాజరు

నీట్ పేపర్ లీక్ తర్వాత రీ-ఎగ్జామ్ను కేవలం 37 రోజుల వ్యవధిలోనే ప్లాన్ చేసి నిర్వహించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా పోలీసులు, అబ్జర్వర్లు, పరీక్ష సిబ్బందితో కలిపి దాదాపు 7 లక్షల మంది అధికారులను రంగంలోకి దించినట్లు ఏజెన్సీ వెల్లడించింది. దాదాపు 20 లక్షలకు పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొంది. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరగ్గా దివ్యాంగులకు సాయంత్రం 6.20గంటల వరకు పరీక్ష నిర్వహించామని తెలిపింది.

### ఫిజిక్స్ పేపర్ టఫ్గా ఉంది!

కాగా, నీట్ రీ-ఎగ్జామ్పై అభ్యర్థుల నుంచి భిన్నమైన స్పందనలు వచ్చాయి. ఓవరాల్గా ప్రశ్నాపత్రం సాధారణంగానే ఉందని చాలా మంది విద్యార్థులు తెలిపారు. అయితే గత పరీక్షతో పోలిస్తే, ఈసారి ఫిజిక్స్ సెక్షన్ చాలా కఠినంగా ఉందని మరికొందరు విద్యార్థులు పేర్కొన్నారు. "పరీక్ష సాధారణంగానే ఉంది. కాకపోతే ఫిజిక్స్ పేపర్ కాస్త లెంగ్తీగా ఉంది. గతంలో కంటే కొంచం కఠినంగా అనిపించింది. అయితే బయాలజీ బాగుంది. కెమిస్ట్రీ ప్రశ్నలు సాధారణంగానే ఉన్నాయి" అని చాలా మంది చెప్పారు. మరొక అభ్యర్థి మాట్లాడుతూ, "గత పరీక్ష కంటే ఇది కొంచెం కష్టంగా అనిపించింది. ఇది నా మొదటి ప్రయత్నం. నాకు దాదాపు 500 మార్కులు వచ్చే అవకాశం ఉంది. పరీక్ష కేంద్రం లోపల ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి" అని చెప్పాడు.

### పేపర్ లీక్ వివాదం

మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకైంది. దీంతో ఎన్టీఏ ఆ పరీక్షను రద్దు చేసి ఆదివారం మళ్లీ నిర్వహించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్ష సజావుగా సాగేందుకు జాతీయ పరీక్షల సంస్థ-ఎన్టీఏ భారీ ఏర్పాట్లు చేసింది. 1.38 లక్షలకుపైగా సీసీ కెమెరాలు, 51వేలకుపైగా జామర్లను ఏర్పాటు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీ ఓఖ్లాలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయంలో ఉండి పరీక్ష నిర్వహణపై నిరంతరం సమీక్ష జరిపారు. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ, ఇప్పటికే పలువురు నిందితులను అరెస్ట్ చేసింది.

# రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు.కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోదీ తెలిపారు.

### మూడు నౌకల ప్రత్యేకతలు

– దూనగిరి: ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.
– సంశోధక్: ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.– అగ్రే: ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలనపై ప్రొగ్రెస్ రిపోర్టులు

సమీక్షించారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగం, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ రంగాలపై ముఖ్యమంత్రి శ్వేత పత్రాలు విడుదల చేశారు.

### రెండేళ్ల వికాసంపై ప్రొగ్రెస్ రిపోర్ట్

వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతలా పురోగతి సాధించింది వంటి అంశాలను తాజా ప్రోగ్రెస్ రిపోర్టులో పొందుపరచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఎలా గాడిలో పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల ఉద్దేశమన్నారు. నాటి 7 శ్వేత అంశాలతో సహా ఈసారి కొత్తగా డెవలప్మెంట్, గవర్నెన్స్, వెల్ఫేర్ అంశాలపైనా రిపోర్టులు విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, టూరిజం అంశాలతో 'డెవలప్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా తెచ్చిన పాలసీలు, అనుసరించిన విధానాలు, చేపట్టిన సంస్కరణలతో 'గుడ్ గవర్నెన్స్' ప్రోగెస్ రిపోర్ట్ సంక్షేమం, పీ4 వంటి వాటితో 'వెల్ఫేర్ -- ఎంపవర్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట్ ఈసారి విడుదల చేయనున్నారు. వీటిలో ఫైనాన్స్, డెవలప్మెంట్, వెల్ఫేర్, గవర్నెన్స్ ఈ 4 అంశాలకు సంబంధించిన ప్రొగ్రెస్ రిపోర్టును ముఖ్యమంత్రి విడుదల చేస్తారు. 6 పేపర్లు మంత్రులు రిలీజ్ చేసిన తర్వాత మిగిలిన 4 పేపర్లు ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.

### జూలై 18 కల్లా ప్రొగ్రెస్ రిపోర్టులు సిద్ధం చేయాలి

జూలై 18కల్లా మొత్తం అన్ని రిపోర్టులు విడుదల చేసేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఇవన్నీ విడుదల చేసిన తర్వాత అన్నీ కలిపి పుస్తక రూపంలో తీసుకురావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రతీ ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టులు తప్పనిసరిగా ఇవ్వాలని ఈ సందర్భంగా చెప్పారు. ప్రోగ్రెస్ రిపోర్ట్లో ముందుగా సోమవారం విద్యుత్ రంగంపై ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేయనున్నారు. ఈ సమీక్షలో మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీతో సమావేశం ఏర్పాటు చేయండి

లోక్సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్గాంధీతో తమకు అపాయింట్మెంట్ ఇప్పించి సమావేశం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, అది తెలంగాణ ప్రజలకు హామీలిచ్చి ఆ పార్టీ చేసిన మహా ద్రోహంగానే భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 2023 నవంబర్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలు తెలంగాణలో పర్యటించి, స్వయంగా ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను నమ్మే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని రామచందర్రావు గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, పేద కుటుంబాలు నేటికీ ఆ పథకాల కోసం ఎదురుచూస్తున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి నిలదీయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పందించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు కుంభకోణం, హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుల విషయమై సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిల మధ్య బహిరంగ లేఖలు కొనసాగుతున్నాయి.

# తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లను

సీటు తీవ్రమైన కుట్రతో చోరీకి గురైందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువులకు విరుద్ధంగా చేస్తున్న కుట్రలను, అక్రమాలను సమాజానికి విడమరిచి చెప్పడానికే తాము ఈ లీగల్ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లు తనకోసం మరొకరితో బలవంతంగా రాజీనామా చేయించి, తెలంగాణ కోటాలో తాను రాజ్యసభ సీటును తీసుకోలేనని చెప్పారు. తాను పుట్టి పెరిగింది, రాజకీయాలు చేసింది మధ్యప్రదేశ్లోనే కాబట్టి ఆ రాష్ట్ర ప్రజల తరపునే తాను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత శత్రువులే మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను ప్రత్యర్థి పార్టీకి అందించారంటూ వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలే ప్రత్యర్థులకు ఇచ్చారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. బీజేపీ తన ఓటమి భయంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపిందని విమర్శించారు. అఫిడవిట్లో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన నామినేషన్ తిరస్కరించాల్సిన అవసరం లేదని దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. స్క్రూటినీ జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను నామినేషన్ రూమ్లోకి అధికారులు ఎందుకు అనుమతించారని ఆమె ఈసీని నిలదీశారు.కాగా, మీనాక్షి నటరాజన్ గతంలో రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలక నేతగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్సభ నియోజకవర్గం నుండి ఎంపీగా కూడా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ కాంగ్రెస్ ఇన్ఛార్జ్గా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఈ నామినేషన్ తిరస్కరణ అంశం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్గా మారింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ తిరస్కరణను కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తుండగా నిబంధనల ప్రకారమే ఈసీ నిర్ణయం తీసుకుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ లీగల్ టీమ్ ఇప్పటికే కసరత్తు చేస్తోంది.

# భారత్ ఇంధన భద్రతకు భారీ ఊరట

నౌకలు 94 మంది భారత సిబ్బందితో హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ఆయన తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీ గారి నిర్ణయాత్మక నాయకత్వంలో భారత ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మన నావికుల భద్రత, దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణ కోసం మా మంత్రిత్వ శాఖ అన్ని సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది" అని సోనోవాల్ తన పోస్ట్లో పేర్కొన్నారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం ఈ మూడు నౌకలు జూన్ 24 నుంచి జులై 1 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. 'దేశ్ వైభవ్' జూన్ 24న గుజరాత్లోని వాడినార్ పోర్టుకు, 'దేశ్ విభోర్' అదే రోజున సిక్కా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఇక జూన్ 20న హర్మూజ్ జలసంధిని దాటిన 'సన్మార్ హెరాల్డ్' నౌక జులై 1న ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది. ఈ పరిణామం వెనుక అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక దౌత్యపరమైన పరిణామాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక ఒప్పందం కుదిరింది. జూన్ 18న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఇరాన్ తన వద్ద ఉన్న అత్యధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తగ్గించుకోవాలి, ప్రతిగా అమెరికా కొన్ని ఆంక్షలను సడలిస్తుంది. ఈ ఒప్పందం తర్వాత, అదే రోజున హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసింది. దీంతో నెలల తరబడి స్తంభించిన ఈ మార్గంలో చమురు ట్యాంకర్ల సంచారం తిరిగి ప్రారంభమైంది.దేశీయ ఇంధన అవసరాల కోసం అధికంగా ముడి చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉన్న భారత్కు, సముద్ర మార్గాల్లో రవాణా నిరంతరాయంగా సాగడం అత్యంత ముఖ్యం. ఈ నౌకలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్య విజయాన్ని, మరోవైపు భారత ప్రభుత్వం తన ఇంధన భద్రతకు, సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సున్నితమైన అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే నౌకలు, సిబ్బంది భద్రత కోసం వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# నీట్ అభ్యర్థులకు వీడియో కాల్.. పేపర్ కోసం రూ.30,000 డిమాండ్

జైపూర్: నీట్ రీఎగ్జామ్కు ముందు కొందరు అభ్యర్థులకు వీడియో కాల్స్ వచ్చాయి. లీకైన పేపర్ కోసం రూ.30,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక విద్యార్థి ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. (చీజుజు ౖఝుజూవతీ) రాజస్థాన్లోని అజ్మీర్లో ఈ సంఘటన జరిగింది. శనివారం పలువురు నీట్ అభ్యర్థులకు వీడియో కాల్స్ వచ్చాయి. నీట్ పేపర్ లీకైనట్లు అందులో చూపించారు. రూ.30,000లకే నీట్ పేపర్ అందజేస్తామని వారు చెప్పారు. క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బు చెల్లించాలని కోరారు.కాగా, అజ్మీర్లోని డీఏవీ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు కృష్ణ సింగ్ ఠాకూర్కు ఈ విషయం తెలిసింది.

దీంతో అతడు స్వయంగా ఆ వీడియో కాల్ చేసిన అమ్మాయితో మాట్లాడి రికార్డ్ చేశాడు. ఆ తర్వాత దీని గురించి పోలీస్ అధికారికి ఆ స్టూడెంట్ ఫిర్యాదు చేశాడు. క్యూఆర్ కోడ్, ఫోన్ చేసిన వ్యక్తి నంబర్తో సహా డిజిటల్ సాక్ష్యాలను అందజేశాడు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ఇలాంటి మోసాలకు గురయ్యారని కృష్ణ సింగ్ ఠాకూర్ ఆరోపించాడు. దీనిపై దర్యాప్తు జరుపాలని పోలీస్ అధికారిని కోరాడు.మరోవైపు ఆ విద్యార్థి ఫిర్యాదుపై అజ్మీర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్యూఆర్ కోడ్కు అనుసంధానమైన మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా గురించి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే వీడియో కాల్ సందర్భంగా చూపించిన నీట్ లీక్ పేపర్ ఆరోపణల ప్రామాణికతను నిర్ధారించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అజ్మీర్ ఎస్పీ ఉషా యాదవ్ తెలిపారు. పేపర్ లీక్ రాకెట్కు సంబంధించిన వాళ్లా లేక విద్యార్థులను మోసం చేయడానికి కొత్త వ్యూహమా అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అయితే ఇలాంటి మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని అభ్యర్థులను కోరారు.

# ఫిన్లాండ్లో అదృశ్యమైన హైదరాబాద్ విద్యార్థి కుటుంబానికి కేటీఆర్ భరోసా

ఉన్నత చదువుల కోసం ఫిన్లాండ్ దేశానికి వెళ్లి గత 45 రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి ముత్యంరెడ్డి మణిదీప్ రెడ్డి ఉదంతంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయమై మణిదీప్ రెడ్డి తల్లిదండ్రులు ముత్యంరెడ్డి, మర్ణతలను స్వయంగా కలిసి మాట్లాడి.. కొడుకు ఆచూకీ తెలియక అల్లాడిపోతున్న ఆ తల్లిదండ్రులకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి భరోసాను, ధైర్యాన్ని ఇచ్చారు.ఒక సామాన్య కుటుంబం ఎన్నో ఆశలతో తమ బిడ్డలను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపితే, ఇవ్వాళ ఆ బిడ్డ ఆచూకీ లేకుండా పోవడం ఆ కుటుంబానికి తీరని వేదన మిగిల్చిందన్నారు కేటీఆర్.

స్థానిక పోలీసులు ఫిర్యాదును పట్టించుకోకపోవడంతోనే బాధిత తల్లిదండ్రులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించాల్సి రావడం దురదృష్టకరం. హైకోర్టు ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఫిన్లాండ్లోని భారత రాయబార కార్యాలయం, తెలంగాణ పోలీసులకు నోటీసులు జారీ చేయడాన్ని మేము స్వాగతిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఫిన్లాండ్లోని భారత రాయబార కార్యాలయం, అక్కడి స్థానిక ప్రభుత్వంతో, అక్కడి అధికారులతో మాట్లాడి మణిదీప్ రెడ్డిని సురక్షితంగా వెతికి పట్టుకునేలా కేంద్ర విదేశాంగ శాఖ తక్షణమే రంగంలోకి దిగాలన్నారు. తెలంగాణ పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, విదేశాంగ శాఖ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి వీలయినంత తొందరగా వెతికిపట్టుకునేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో గ్యాస్ లీక్.. ఇద్దరు మృతి, 50 మందికిపైగా అస్వస్థత

చెన్నై: సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో అమ్మోనియా గ్యాస్ లీక్ అయ్యింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో 50 మందికిపైగా అస్వస్థత చెందారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. (ఖఎఎశీఅఱఎ స్త్రుం శ్రీఋఎ) తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెరియపాలయం సమీపంలోని కన్నిగైపైర్లో ఉన్న సెయింట్ పీటర్స్ అండ్ పాల్ సీఫుడ్స్ ఎక్స్పోర్ట్స్ కేంద్రంలో ఆదివారం అమ్మోనియా గ్యాస్ లీక్ అయ్యింది.కాగా, ఈ సంఘటన వల్ల అందులో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు మరణించారు. సుమారు 46 మంది వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. వారిని వెంటనే అంబులెన్స్లలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మరోవైపు కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఏడుగురికి వెంటిలేటర్పై చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. బాధిత కార్మికుల్లో చాలా మంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారేనని పోలీస్ అధికారి తెలిపారు. సీఎం విజయ్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

# హెల్దీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా యోగాసనాలు

రామ్దేవ్తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో బాబా రామ్దేవ్తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ (సుఖీభవ ఏపీ) సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో విశాఖపట్నంలో 'యోగాంధ్ర-2025' పేరిట భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ బుక్, ప్రపంచ రికార్డులను సృష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని, ఈ సంస్కృతిని ఇంటింటికీ చేర్చి ప్రజారోగ్యాన్ని కాపాడటమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో బాబా రామ్దేవ్ చేసిన అమోఘమైన కృషిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు.రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రొటోకాల్స్ రూపొందించడానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం 'యోగాంధ్ర' పేరిట ప్రత్యేక డిజిటల్ పోర్టల్ను కూడా తీసుకురానున్నారు. అలాగే, రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్లను పూర్తిగా దూరంగా పెట్టాలని, రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను దరిచేరనివ్వకుండా చూసుకోవచ్చని హితవు పలికారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీన్ కవర్) 50 శాతానికి పెంచుతామని చెబుతూ.. రాబోయే ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు యోగాను కూడా అందులో భాగం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట పాటు యోగా, ధ్యానం, ప్రాణాయామంకు కేటాయిస్తే అసలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరమే రాదని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నగర వాసులు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఈ ఒక్క సంవత్సరం మీ ఇండ్లను కాపాడుకోండి

### అభివృద్ధి పేరుతో తెలంగాణలో లూటీలు

'రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో లూటీలు జరుగుతున్నాయి కానీ హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. హనుమాన్ నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

### మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే

'కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు కూడా లేవు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాది'బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.'ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోండి కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దు. పెద్దలకు ఒక నీతి పేదలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తున్నది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. మేమంతా మీకు అండగా ఉంటాం ఎవ్వరూ భయపడకండి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదు'అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్కు పూర్తి అధికారాలు కల్పించారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య, సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

### అసలేం జరిగింది?

విచారణ పేరుతో మే 9న తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి రాలేదని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చేసి, కొట్టి చంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, జూన్ 15న సాయి కృష్ణను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది.

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది.గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జ్ల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.

# 'ది నానో' పేరుతో అక్రమ విద్యా మాఫియా

- విద్య పేరుతో అక్రమ దందా.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- మున్సిపల్ పర్మిషన్ లేదు, ఫైర్ సేఫ్టీ లేదు, ఇంటర్ బోర్డు గుర్తింపే లేదు
- 400 గజాల ఇరుకు భవనాల్లో 300 మంది విద్యార్థులను కుక్కి లక్షల ఫీజుల వసూళ్లు
- అధికారుల అండదండలతో సాగుతున్న అక్రమాలపై స్థానికుల ఆగ్రహం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యాసంస్థే నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ వ్యాపార కేంద్రంగా మారితే విద్యార్థుల భవిష్యత్తు ఏ దిశగా సాగుతుంది.? బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలో వెలుగుచూసిన "ది నానో జూనియర్ కాలేజ్" వ్యవహారం ఇప్పుడు ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. కనీస మున్సిపల్ అనుమతులు లేకుండా, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా, ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు లేకుండానే వందలాది మంది విద్యార్థులను చేర్చుకుని లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎదురుగా, విజయలక్ష్మీనగర్ కాలనీలో వెలిసిన ఈ కాలేజీ రెండు క్యాంపస్‌ల పేరుతో అనుమతులు లేకుండా అక్రమ కార్యకలాపాలను కొనసాగిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం 400 గజాల అక్రమ నిర్మాణం ఇరుకు స్థలంలో అగ్గిపెట్టెల్లాంటి గదులను క్లాస్‌రూమ్‌లుగా మార్చి దాదాపు 300 మంది విద్యార్థులను కుక్కినట్లు సమాచారం. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు సరైన మార్గాలు కూడా లేని భవనాల్లో విద్యార్థులు చదువుకోవడం ప్రమాదకరమని స్థానికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### ప్రముఖ బ్రాండ్ పేరుతో మోసం.?

విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రముఖ విద్యా సంస్థల పేర్లను పోలి ఉండే విధంగా ప్రభుత్వ అనుమతులు లేకున్నా "ది నానో" అనే పేరుతో ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రంగురంగుల ప్రకటనలు, ఆకర్షణీయమైన హామీలతో అడ్మిషన్లు చేపట్టి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, కాలేజీకి అవసరమైన ప్రాథమిక అనుమతులు ఉన్నాయా లేదా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవారు కనిపించడం లేదు.

### కన్నెత్తి చూడని అధికారులు..

ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి దినేష్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని వీళ్లకు లంచాలు అందాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన చిన్న వ్యాపారాలపై వెంటనే చర్యలు తీసుకునే మున్సిపల్ అధికారులు, వందలాది మంది విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ కాలేజీ భవనం విషయంలో ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడుతున్నారు.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?

ఫైర్ సేఫ్టీ లేకుండా, అత్యవసర డోర్ మార్గాలు లేకుండా, ఇరుకు గదుల్లో వందలాది మంది విద్యార్థులను ఉంచడం తీవ్రమైన ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో అనేక విద్యాసంస్థల్లో జరిగిన అగ్నిప్రమాదాలు, భవన ప్రమాదాలు పాఠాలు నేర్పినా ఇక్కడ మాత్రం నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### తక్షణమే సీజ్ చేయాలంటున్న స్థానిక ప్రజలు

విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడకముందే జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ఇంటర్మీడియట్ బోర్డు, మున్సిపల్ శాఖ సంయుక్తంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు భద్రతా ప్రమాణాలు పరిశీలించి అక్రమాలు నిజమైతే వెంటనే కాలేజీని సీజ్ చేసి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్య పేరుతో జరుగుతున్న ఈ అక్రమ మాఫియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ చెక్ పెట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# డీఎస్సీ డ్యామేజ్ ఎవరికి...

**విజయవాడ :** డీఎస్సీ 2025 విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి షాక్ తప్పలేదు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలు అనేక రకాల అవకతవకలు జరిగాయని గత కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి అయితే తన పక్కన డీఎస్సీ అభ్యర్థులను పెట్టుకుని మరి ఆరోపణలు చేస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో అనుకున్న స్థాయిలో వైసీపీకి ప్రజల్లో మైలేజ్ దక్కలేదు. అలా దక్కలేదు సరి కదా తిరిగి డ్యామేజ్ జరిగింది. దానికి కారణం లేకపోలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు మాదిరిగా కూటమి నుంచి ఎదురుదాడి రాలేదు. ఒక పద్ధతి ప్రకారం అధికారులు మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణలు ఇచ్చారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నం గా ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. అందుకే లైట్ తీసుకుంటున్నారు. మరికొందరైతే అసహ్యించుకుంటున్నారు వైసీపీ తీరుపై. ఎప్పటికప్పుడు స్టాండ్ మార్చుతూ.. డీఎస్సీ విషయంలో వైసిపి ఒక స్టాండ్ తో ముందుకు వెళ్లలేదు. రకరకాల ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆరోపణలకు కూటమి నేతలు కౌంటర్ ఇచ్చి ఉంటే అది రాజకీయ రగడగా మారి ఉండేది. అందుకే ప్రభుత్వం వ్యూహాత్మకంగా విద్యాశాఖ ఉన్నతాధికారులను రంగంలోకి దించింది. సాక్షి మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలను కేస్ స్టడీస్ గా తీసుకుంటూ ఒక్కో అనుమానాన్ని నివృత్తి చేశారు. ఎంతో ఓపికగా అధికారులు సమాధానాలు చెప్పారు. దీంతో ఆదిలోనే దానికి కౌంటర్ ఇవ్వగలిగారు అధికారులు. సోషల్ మీడియాలో అధికారులు ఇచ్చే కౌంటర్ ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. లోకేష్ సవాల్ తో.. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద ఆధారాలు ఉంటే కచ్చితంగా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చు అని ప్రభుత్వ వర్గాలు సలహా ఇచ్చాయి. అది కూడా ప్రజల్లోకి వెళ్లింది. వైసీపీ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు అంటూ ప్రజలు ఒక నిర్ధారణకు కూడా వచ్చారు. అక్కడితే ఆగలేదు. మళ్లీ కమ్మ డీఎస్సీ అంటూ చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో కమ్మ సామాజిక వర్గం వారికి అధిక అవకాశాలు కల్పించారు అంటూ ఆరోపణలు చేశారు. దానిని కూడా నివృత్తి చేసింది విద్యాశాఖ. రెడ్డి సామాజిక వర్గానికి 10 పోస్టులు, కాపు సామాజిక వర్గానికి 16 పోస్టులు ఇస్తే కమ్మ సామాజిక వర్గానికి మాత్రం 9 పోస్టులు కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఆ విషయంలో కూడా ఆ పార్టీకి షాక్ తప్పలేదు. చివరిగా లోకేష్ సాహసించి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు చర్యలను తప్పుపడుతూ.. అవసరం అనుకుంటే జగన్మోహన్ రెడ్డి తనతో చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. దానికి సై అనలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. లక్ష్మీపార్వతి తో పాటు యాంకర్ శ్యామల లాంటి వారిని పంపించారు. మరోసారి డీఎస్సీ విషయంలో చతికిల పడ్డారు. ఈ మొత్తం పరిణామాలతో ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారు. డీఎస్సీ విషయంలో వైసిపి కుట్ర చేస్తుంది అనే అనుమానాలను ఎక్కువమంది నమ్మారు. అంతిమంగా ఇప్పుడు ఈ డీఎస్సీ అంశం అనేది వైసీపీకి ఎక్కువగా డ్యామేజ్ చేస్తోంది. ముమ్మందు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# 24 నుంచి బంగారం గనుల తవ్వకాలు

**కర్నూలు** ప్రైవేట్ భాగస్వామ్యంతో దేశీయ ఖనిజ రంగంలో సరికొత్త రికార్డు సృష్టించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. భారతదేశంలోనే తొలిసారిగా భారీ తరహా ప్రైవేట్ బంగారు గని ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించబోతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ను ఈ నెల 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు.జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ , డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు రూ. 400 కోట్లకు పైగా వ్యయంతో ఈ గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి గ్రామాల్లో విస్తరించి ఉన్న సుమారు 598 హెక్టార్ల లీజు భూమిలో ఈ మైనింగ్ క్షేత్రాన్ని అభివృద్ధి చేశారు. అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాలతో కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే ఇక్కడి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణాన్ని, పైలట్ రన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రతి ఏటా సుమారు 4 లక్షల టన్నుల బంగారు ఖనిజాన్ని ప్రాసెస్ చేయనున్నారునిక్షేపాల అంచనాల పరంగా జొన్నగిరి గని దేశీయ పసిడి రంగంలో గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ప్రాథమిక అన్వేషణలో జొన్నగిరి ఓపెన్ పిట్ పరిధిలోనే దాదాపు 13,100 కిలోల నిఖార్సైన బంగారు నిల్వలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వేలు స్పష్టం చేశాయి. ఇక మొత్తం లీజు మైనింగ్ ప్రాంతంలో అంచెలంచెలుగా జరిపిన లోతైన పరిశోధనల ప్రకారం.. ఇక్కడ ఏకంగా 42.5 టన్నుల నుండి 50,000 కిలోల వరకు పసిడి నిల్వలు పెరిగే అవకాశం ఉన్నట్లు మైనింగ్ నిపుణులు నిర్ధారించారు. పూర్తిస్థాయి కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమయ్యాక, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏడాదికి సగటున 1,000 కిలోల శుద్ధి చేసిన విదేశీ ప్రమాణాల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ భారీ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో లభించిన ఉత్సాహంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఖనిజ సంపద వెలికితీతను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో గుర్తించిన మరో నాలుగు కొత్త గోల్డ్ బ్లాక్‌లను త్వరలోనే బహిరంగ వేలం వేయడానికి మైన్స్ అండ్ జియాలజీ శాఖ కసరత్తు పూర్తి చేసింది. భారతదేశం ప్రతి ఏటా దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్న తరుణంలో.. కేజీఎఫ్ మూతపడిన తర్వాత ఏర్పడిన లోటును భర్తీ చేస్తూ ఏపీలో ప్రారంభమవుతున్న ఈ జొన్నగిరి ప్రాజెక్ట్ దేశ ఆర్థికాభివృద్ధికి, స్థానిక నిరుద్యోగుల ఉపాధికి పెద్ద బూస్ట్‌గా నిలవనుంది.

# జులైలో ఆకాశంలో అద్భుతాల జాతర

## - గ్రహాల కలయిక నుంచి ఉల్కాపాతం వరకు!

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఖగోళ ప్రియులకు, ఆకాశాన్ని ఆసక్తిగా గమనించే వారికి 2026 జులై నెల ఒక కనుల పండుగ తీసుకురాబోతోంది. గ్రహాల అరుదైన కలయికల నుంచి ఉల్కాపాతాల వరకు అనేక అద్భుత దృశ్యాలు ఈ నెలలో ఆవిష్కృతం కానున్నాయి. సాధారణ కంటితో చూడగలిగేవి కొన్ని అయితే, బైనాక్యులర్ల సహాయంతో మరికొన్నింటిని వీక్షించవచ్చు. ఈ నెలలో జరగబోయే ముఖ్యమైన ఖగోళ విశేషాలు వరుసగా ఉన్నాయి, వీటిని వీక్షించడం ద్వారా మరపురాని అనుభూతిని పొందవచ్చు.

### - అంగారకుడు, యురేనస్ అరుదైన కలయిక

ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున తూర్పు ఆకాశంలో అంగారకుడు (మార్స్), యురేనస్ గ్రహాలు చాలా దగ్గరగా కనిపించి కనువిందు చేస్తాయి. ఇది చాలా అరుదైన గ్రహాల కలయిక. ప్రకాశవంతమైన అంగారకుడిని సాధారణ కంటితో చూడగలిగినప్పటికీ, యురేనస్‌ను స్పష్టంగా చూడాలంటే బైనాక్యులర్లు లేదా చిన్న టెలిస్కోప్ అవసరం. స్పష్టమైన ఆకాశం ఉంటే ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి ఈ దృశ్యాన్ని వీక్షించవచ్చు.

### - సూర్యుడికి అత్యంత దూరంగా భూమి

జులై 6న భూమి సూర్యుడి నుంచి తన కక్ష్యలో అత్యంత దూరంలోకి వెళ్తుంది. దీనిని ఖగోళ పరిభాషలో 'అపహేలి' అంటారు. ఆ రోజు భూమికి, సూర్యుడికి మధ్య దూరం సుమారు 152.1 మిలియన్ కిలోమీటర్లు ఉంటుంది. ఇది కంటికి కనిపించే అద్భుతమేమీ కానప్పటికీ, భూమిపై రుతువులు ఏర్పడటానికి సూర్యుడికి, భూమికి మధ్య దూరం కారణం కాదని, భూమి అక్షం వంపు వల్లే రుతువులు ఏర్పడతాయనే శాస్త్రీయ వాస్తవాన్ని గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందర్భం ఇది.

### - మాన్‌హాటన్‌హెంజ్, అమావాస్య

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జులై 11-12 తేదీల్లో 'మాన్‌హాటన్‌హెంజ్' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సూర్యాస్తమయ సమయంలో సూర్యుడు నగరం యొక్క తూర్పు-పడమర వీధులకు సరిగ్గా మధ్యలో ప్రకాశిస్తూ, ఆకాశహర్మ్యాల మధ్య అగ్నిగోళంలా కనిపిస్తాడు. ఇక జులై 14న అమావాస్య వస్తుంది. ఆ రోజు ఆకాశం అత్యంత చీకటిగా ఉంటుంది కాబట్టి, పాలపుంత కేంద్ర భాగాన్ని, ఇతర నక్షత్ర మండలాలు, సుదూర ఖగోళ వస్తువులను వీక్షించడానికి ఇది అనువైన సమయం.

### -చంద్రుడు-శుక్రుడు, బక్ మూన్

జులై 17న సూర్యాస్తమయం తర్వాత పశ్చిమ వాయువ్య దిశలో సన్నని చంద్రవంక ప్రకాశవంతమైన శుక్ర గ్రహానికి (వీనస్) చాలా దగ్గరగా కనిపిస్తుంది. ఇది సాధారణ కంటితో చూడగలిగే ఎంతో అందమైన దృశ్యం. ఆ తర్వాత, జులై 29న పౌర్ణమి వస్తుంది. దీనిని 'బక్ మూన్' అని పిలుస్తారు. ఈ సమయంలో మగ జింకలకు కొత్త కొమ్ములు పెరుగుతాయి కాబట్టి ఈ పేరు వచ్చింది.



### - డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం

ఈ నెలాఖరున, జులై 30-31 తేదీలలో, సదరన్ డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఇది వేసవిలో నమ్మకంగా కనిపించే ఉల్కాపాతాలలో ఒకటి. అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజాము వరకు (సుమారు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 4-5 గంటల మధ్య) గంటకు డజన్ల కొద్దీ ఉల్కలు ఆకాశంలో మెరిసి మాయమవుతాయి.
ఈ సమయంలో చంద్రుడి కాంతి తక్కువగా ఉండటం వల్ల, మసకగా ఉండే ఉల్కలను కూడా చూసే అవకాశం ఉంటుంది. ఈ ఉల్కలు చాలా నెమ్మదిగా, పొడవైన తోకలతో ప్రయాణిస్తున్నట్లు కనిపించడం వీటి ప్రత్యేకత. ఈ ఖగోళ సంఘటనలలో చాలా వరకు సాధారణ కంటితో లేదా చిన్న బైనాక్యులర్ల సహాయంతో వీక్షించవచ్చు. అయితే, సమయాలు మీ ప్రాంతాన్ని బట్టి కొద్దిగా మారవచ్చు. కాబట్టి, ఆకాశంలో ఈ అద్భుతాలను వీక్షించాలనుకునే వారు స్థానిక సమయాలను సరిచూసుకోవడం మంచిది.

# అపసోపాలు పడుతున్న అమరావతి, పోలవరం

**విజయవాడ** ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రధానంగా వినిపించిన నినాదం ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం . గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ రెండు ప్రాజెక్టులు రివర్స్ టెండరింగ్, విధానపరమైన నిర్ణయాల వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయనే బలమైన విమర్శల మధ్య కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తీవ్రమైన చట్టపరమైన, ఆర్థికపరమైన, సాంకేతికపరమైన సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనల వల్ల అమరావతిలో దాదాపు 45,000 కోట్ల విలువైన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి అడవిని తలపించాయి. అటు పోలవరంలో గైడ్ బండ్ దెబ్బతినడం, డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. మొదటి ఆరు నెలల కాలాన్ని కేవలం నష్ట నివారణ చర్యలు, నిధుల సమీకరణకే కేటాయించాల్సి వచ్చింది. రాజధాని అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించింది. గత ఐదేళ్ల వైఫల్యాల వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ బ్యాంకుల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారు. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ల నుంచి ఉమ్మడిగా 15,000 కోట్ల ప్రత్యేక రుణాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ నిధులతో గతంలో ఆగిపోయిన ఐకానిక్ నిర్మాణాలు ? సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్, జడ్జీల క్వార్టర్ల నిర్మాణ పనులను నూతన ఎల్అండ్‌టీ , షాపూర్జీ పల్లోంజీ సంస్థలకు అప్పగించి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిలో గత రెండేళ్లలో మౌలిక వసతుల కల్పన 45 శాతం మేర పూర్తయింది. గతంలో నిలిచిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థలతో పాత ఒప్పందాలను పునరుద్ధరించడమే కాకుండా, దాదాపు 12 జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అమరావతిలో భూములు కేటాయించడం ద్వారా ఈ రెండేళ్లలోనే సుమారు 8,000 కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించగలిగారు.కూటమి ప్రభుత్వానికి అత్యంత సవాలుగా మారింది పోలవరం ప్రాజెక్టు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిగా పునర్నిర్మించాలా లేదా పాతదానికి మరమ్మతులు చేయాలా అనే సాంకేతిక మీమాంసకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం తెరదించింది. దెబ్బతిన్న పాత డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా దాదాపు 2,000 కోట్ల అంచనా వ్యయంతో నూతన వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో సఖ్యతను ఉపయోగించుకుని, పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ద్వారా 12,157 కోట్ల అదనపు నిధుల ప్యాకేజీని కూటమి ప్రభుత్వం మంజూరు చేయించుకోగలిగింది. ఈ రెండేళ్ల కాలంలో పోలవరం ప్రధాన డ్యామ్ పనులు, స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక 85 శాతం పూర్తయింది. కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులు, టన్నెల్ పనులలో గత రెండేళ్లలో 22 శాతం అదనపు పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని పునరావాస ప్రక్రియ కోసం సుమారు 5,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖజానా ఖాళీగా ఉండటం, భారీగా ఉన్న అప్పుల భారం వంటి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం అమరావతి - పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గడిచిన రెండేళ్ల డేటాను పరిశీలిస్తే.. ప్రచార ఆర్భాటాల కంటే క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పునరుద్ధరణ, కేంద్రం నుంచి నిధుల రాకపైనే ప్రభుత్వం ఎక్కువ విజయం సాధించిందని స్పష్టమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులను అధిగమించి చూపిస్తున్న ఈ పురోగతి.. రాబోయే మూడేళ్లలో ఏపీ అభివృద్ధి రథాన్ని మరింత వేగంగా ముందుకు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు నమ్మకంతో ఉన్నారు.

# ఆర్థిక ప్రగతిపై లోకేష్ కొత్త రోడ్‌మ్యాప్

**విజయవాడ :** ఏపీలోని టీడీపీ కూటమిలో యువ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జాతీయ స్థాయిలో తన పలుకుబడిని మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ మంత్రిగా ఆయన కేవలం రాష్ట్రానికే పరిమితం కావడం లేదు. అదే సమయంలో ఢిల్లీకి అనేక సార్లు వెళ్ళి వస్తున్నారు. కేంద్ర మంత్రులను విరివిగా కలుస్తున్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా సమావేశం అవుతున్నారు. తాను చురుకైన యువ నేతగా ఏపీ రాజకీయాల్లో ఉన్నాను అని తెలియచేసేందుకు ఈ పర్యటనలు లోకేష్ కి ఎంతగానో దోహదపడుతున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి.కేవలం దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే లోకేష్ పర్యటనలు పరిమితం కావడం లేదు, ఆయన వివిధ రాష్ట్రాలలో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాల మీదనే ఈ పర్యటనలు అని ప్రచారం జరుగుతున్నా వాటితో పాటుగా స్వామి కార్యం అన్నట్లు లోకేష్ ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న నాయకులను ముఖ్యమంత్రులను కలుసుకుంటూ వారితే మమేకం అవుతూ యంగ్ డైనమిక్ లీడర్ గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇదిలా ఉంటే నారా లోకేష్ తాజాగా పశ్చిమ బెంగాల్ కి వెళ్ళారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారితో కోల్ కతాలో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు రెండు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నారు. ఏపీలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి లోకేష్ సువేందుకు తెలిపారు. ఏపీలో అత్యధిక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కూడా చెప్పారు. లిపశ్చిమ బెంగాల్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని సువేందుని లోకేష్ కోరడం విశేషం. ఇదే సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సువేందుకు లోకేష్ విన్నవించారు.ఇంతకు ముందు ముంబై పర్యటనకు వెళ్ళిన నారా లోకేష్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తో కూడా భేటీ అయి అనేక అంశాలను ముచ్చటించారు. ఇలా లోకేష్ బీజేపీలో కీలకమైన రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ముఖ్యమంత్రులతో భేటీలు వేయడం రాజకీయంగా ఆసక్తిని కలిగించే అంశంగానే చూస్తున్నారు ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కావడం విశేషం. ఇక ఏపీ నుంచి రాజకీయంగా ఎదుగుతున్న నేతగా లోకేష్ ఉన్నారు. దాంతో ఆయన జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ పెద్దలతో పాటు యువ ముఖ్యమంత్రులతోనూ అదే రకమైన సాన్నిహిత్యం నెరపడం వెనక ముందు చూపు ఉందని అంటున్నారు. రానున్న రోజులలో ఆయన ఇదే తీరులో మరెంత మంది ముఖ్యమంత్రులను కీలక నేతలను కలుస్తారు అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఏది ఏమైనా ఏపీకి చెందిన మంత్రిగా ఉన్న లోకేష్ తన పలుకుబడిని జాతీయ స్థాయిలో ఒక క్రమపద్ధతిలో విస్తరించుకుంటున్నారు అన్న మాట అయితే గట్టిగా వినిపిస్తోంది. జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ ఏపీ ఆర్థిక ప్రగతిపై సరికొత్త రికార్డు రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోల్‌కతాలో నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా.. ప్రస్తుతం 220 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తులో ఏకంగా 2.4 ట్రిలియన్ డాలర్ల మహా సామ్రాజ్యంగా విస్తరించడమే తమ కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఈ అద్భుత వృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలంటూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార వర్గాలకు ఆయన బహిరంగ పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు ఏ విధంగా దేశంలోనే అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా మారిందో వివరించడానికి మంత్రి లోకేష్ సరికొత్తగా 3హ సూత్రాన్ని తెరపైకి తెచ్చారు. మొదటి 'హ' అంటే స్పీడ్ , రెండో 'హ' స్టెబిలిటీ , మూడో 'హ' సర్వీస్ అని ఆయన అభివర్ణించారు. మీరు మాతో చేతులు కలిపిన మరుక్షణమే.. అది కేవలం మీ ప్రైవేట్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, మా ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా మారుతుంది. పారిశ్రామికవేత్తలు దశాబ్దాల తరబడి అనుమతుల కోసం తిరిగే రోజులకు ఏపీలో స్వస్తి పలికాం. స్పీడ్ గవర్నెన్స్ ద్వారా నిర్ణీత కాలంలోనే పనులు పూర్తి చేసి చూపిస్తాం అని లోకేష్ కార్పొరేట్ వర్గాలకు గట్టి నమ్మకాన్ని ఇచ్చారు. ఇదే తరుణంలో జాతీయ స్థాయిలో రాజకీయ స్థిరత్వాన్ని అందిస్తూ, దేశాన్ని సంస్కరణల వైపు నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.ఈ పర్యటనలో భాగంగా ఐసీసీ సదస్సుతో పాటు కోల్‌కతా కేంద్రంగా ఉన్న పలువురు ప్రముఖ జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు చెందిన టాప్ సీఈఓలతో విడివిడిగా భేటీ అయ్యారు. రాబోయే ఐదేళ్లలో ఏపీలో 78.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు తెచ్చిన నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ గురించి వారికి వివరించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారీ గ్రీన్ ఎనర్జీ హబ్‌ను ప్లాన్ చేస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు.. ఏపీలో ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం, పోర్టు ఆధారిత మౌలిక వసతుల వైపు దృష్టి సారించేలా లోకేష్ తన ప్రతిపాదనలను ముందుంచారు.మంత్రి లోకేష్ ప్రతిపాదించిన ఈ 2.4 ట్రిలియన్ డాలర్ల విజన్, త్రీ ఎస్ ఫార్ములా కోల్‌కతా పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.
కేవలం విధానాల ప్రకటనలకే పరిమితం కాకుండా, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ స్థాపన, ఐటీ కారిడార్ల విస్తరణ వంటి ప్రత్యక్ష ప్రాజెక్టులను లోకేష్ ఈ పర్యటనలో ప్రాజెక్ట్ చేశారు. ల్యాండ్ అక్విజిషన్ వేగవంతం చేస్తామని, పారిశ్రామికవేత్తలకు ఎర్రటి తివాచీ పరుస్తామని మంత్రి లోకేష్ ఇచ్చిన భరోసాతో బెంగాల్‌కు చెందిన పలు మల్టీనేషనల్ కంపెనీలు త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# నర్సింగ్ కళాశాలలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

## మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శామీర్ పేట మండలం లోని అలియాబాద్ లో ఉన్న మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన నర్సింగ్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తో పాటూ డా. రామారావు, శాస్త్రవేత్త, బాబా అటమిక్ రీసెర్చి సెంబర్, ముంబై వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో యోగా గురువు పేర్కొన్నట్లు సిబ్బంది, నర్సింగ్ కళాశాల మరియు స్కూలు విద్యార్థీ, విద్యార్థిణులు యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె శివరామకృష్ణ మాట్లాడుతూ యోగా ఏదో వ్యాయామం చేసే ప్రక్రియ కాదని శరీరంలోని ప్రతి అవయవాన్ని కదిలించే విశిష్టత కలిగినదని పేర్కొన్నారు. యోగా భారతదేశానికి ప్రకృతి ప్రసాదించి వరమని అలాంటి యోగా వైపు ఈ రోజు ప్రపంచ ప్రజలందరూ చూడడం ఎంతో గర్వకారణంగా భావించాలని చెప్పారు. నిత్యం యోగా అభ్యసించడం ద్వారా యువత నిత్య చైతన్యవంతులు కావచ్చని అందు చేత యోగాను నిరంతరం చేయడం ద్వారా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలో ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారితో పాటూ డా. రామారావు, సైంటిస్టు, బాబా అటమిక్ రీసెర్చి సెంటర్, ముంబయి -- డా మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్, అకడమిక్స్, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ - డా. దేవి, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పట్టణంలోని శ్రీ గార్డెన్‌లో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. “ఆరోగ్యం కోసం యోగా” అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన చేశారు. ఉదయం ప్రత్యేక యజ్ఞంతో ప్రారంభమైన ఈ వేడుకల్లో అధికారిక ప్రోటోకాల్ ప్రకారం ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. నేటి ఆధునిక ఒత్తిడితో కూడిన జీవనశైలికి యోగా ఒక అద్భుతమైన ఔషధమని, నిత్యం కనీసం అరగంట పాటు యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందని, యువత మొబైల్ ఫోన్ల వాడకం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను యోగా ద్వారా అధిగమించవచ్చని సూచించారు. ప్రజల్లో అవగాహన కోసం భవిష్యత్తులో మరిన్ని శిబిరాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులు ఎం కిషోర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పురపాలక అధ్యక్షురాలు జే.కే శైలజహరినాథ్, ఇతర స్థానిక నాయకులు, పతంజలి యోగ సమితి సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసత్య కథనాలపై చర్యలు తీసుకోవాలి

## - మల్కపేట కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు : శ్రీనివాస్



కోనరావుపేట / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం, మల్కపేట గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ తనపై ప్రచురితమైన అసత్య కథనాలను ఖండించారు. తన ప్రమేయం లేకుండా ఓ దినపత్రికలో తప్పుడు వార్తలు ప్రచురించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, తాను ఎప్పుడూ జైలుకు వెళ్లకపోయినా జైలుకు వెళ్లినట్లు పత్రికలో ప్రచురించడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కనీస వాస్తవాలు తెలుసుకోకుండా,ఎవరి మెప్పు పొందడానికో ఒక బీసీ బిడ్డను బలి చేయాలని చూడటం సరైంది కాదని మండిపడ్డారు.ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య కథనాలు ప్రచురించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు ప్రచారాలను సహించబోమని హెచ్చరించారు.

# మూడు ముక్కలు నాలుగు దిక్కులైన బీఆర్ఎస్

- ములుగులో గులాబీ వాడింది, హస్తం వికసించింది
- వర్గపోరుతో బీఆర్ఎస్ ఖాళీ
- సీతక్క చాణక్యం ముందు సాగని బీఆర్ఎస్ పావులు
- 90% పంచాయతీలు కాంగ్రెస్ ఖాతాలోనే
- కుసుమ జగదీశ్ వర్గం చేరికతో ములుగులో కాంగ్రెస్‌కు తిరుగులేని ఆధిపత్యం.
- దారితప్పిన గులాబీ క్యాడర్
- ఆదివాసీ గడ్డపై హస్తం జెండా రెపరెపలు
- ములుగులో బీఆర్ఎస్ ఉనికికే ముప్పు
- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ, బీ ఆర్ ఎస్ కార్యకర్తలు కనుమరుగు.
- ములుగు జిల్లాలో బీఆర్ఎస్ ఉనికికే ముప్పు
- వర్గపోరుతో కుదేలవుతున్న గులాబీ శ్రేణులు

ములుగు( ప్రశ్న న్యూస్) ములుగు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వర్గపోరుతో నాయకత్వం మూడు ముక్కలవ్వగా, క్షేత్రస్థాయి కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇదే అదనుగా కాంగ్రెస్ పార్టీ జిల్లాపై ఏకచ్ఛత్రాధిపత్యం దిశగా దూసుకుపోతోంది.

### వర్గపోరుతో విలవిల..



మూడు ముక్కలాట: జిల్లాలో బీఆర్ఎస్‌లో ప్రస్తుతం మూడు వర్గాలు. నాగజ్యోతి వర్గం ఒకవైపు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు వర్గం మరోవైపు కుమ్ములాడుకుంటుంటే, మాజీ జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్ వర్గం మొత్తం కాంగ్రెస్ గూటికి చేరింది. ట్విస్ట్ ఏంటి అంటే కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య వర్గం బీఆర్ఎస్ తో ఉంది.

కార్యకర్తల ఆవేదన: పార్టీని నమ్ముకున్న సామాన్య కార్యకర్తకు దారి కనిపించడం లేదు. ఏ నాయకుడి వెంట వెళ్లాలో తెలియక, పైగా అధికార కాంగ్రెస్ వేవ్‌తో సతమతమవుతున్నారు. మా ఎజెండా ఏంటో, మా లీడర్ ఎవరో తెలియని అయోమయం అని మండల స్థాయి నేతలు వాపోతున్నారు. ఒకవైపు టికెట్ విషయంలో పొదెం వీరయ్య కు లేదా సత్యవతి రాథోడ్ కవితకు అన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మరి బడే నాగజ్యోతి పరిస్థితి ఏమిటి అని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

### సీతక్క చాణక్యం - కాంగ్రెస్ హవా..

**ఏకచ్ఛత్రాధిపత్యం:** మంత్రి సీతక్క రాజకీయ చాణక్యంతో ములుగు జిల్లాలో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా అవతరించింది. వర్గాలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోతుండడంతో ప్రజల్లో బలమైన ముద్ర పడింది.

**సర్పంచ్ ఎన్నికలే సాక్ష్యం:** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 90% సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. ఇది గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు ఉన్న పట్టును, టీఆర్ఎస్ పతనాన్ని కళ్లకు కడుతోంది.

**వలసల పర్వం:** బీఆర్ఎస్‌లో కీలక నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వరుసగా కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. జగదీశ్వర్ వర్గం చేరికతో జిల్లాలో బీఆర్ఎస్‌కు పెద్ద దిక్కు లేకుండా పోయింది.

### భవిష్యత్ ప్రశ్నార్థకం..

ఇదే పరిస్థితి కొనసాగితే ములుగు జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్త కూడా కనిపించని పరిస్థితి వస్తుందని రాజకీయ విశ్లేషకులు



అంచనా వేస్తున్నారు. వర్గపోరుకు చెక్ పెట్టి, క్యాడర్‌లో భరోసా నింపకపోతే గులాబీ జెండా ములుగు గడ్డపై కనుమరుగవడం



ఖాయం.

ప్రస్తుతం జిల్లాలో నినాదం ఒక్కటే హస్తం గుర్తు సీతక్క నాయకత్వం. బీఆర్ఎస్ కోలుకోవాలంటే మాత్రం మహా అద్భుతమే జరగాలి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### ములుగులో కాంగ్రెస్ అభివృద్ధి. ఆదివాసీ ఆశలకు భరోసా..

తెలంగాణలోని గిరిజన గుండెకాయ ములుగు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ గూడేలు, పోడు భూముల సమస్య, గోదావరి వరదల బాధితుల గోడు వినే నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ వైపు ఆశగా చూస్తున్నారు.

### ఆదివాసీ ప్రాబల్యం..

ములుగు నియోజకవర్గంలో 60% పైగా ఎస్టీ ఓటర్లు. గోండు, కోయ, లంబాడా తెగల ప్రజలకు జల్-జంగిల్-జమీన్ హక్కులే ప్రధాన ఎజెండా. పోడు పట్టాల జాప్యం, రోడ్లు లేని తండాలు, సమ్మక్క-సారలమ్మ జాతరకు శాశ్వత నిధుల్లేమి, విద్యా వైద్య సౌకర్యాల కొరత. గోదావరి వరదలతో ఏటా ముంపునకు



గురయ్యే 40 గ్రామాలకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లేదు.

### యువత ఆకాంక్ష..

నిరుద్యోగం, వలసలు. స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు, ఐటీడీఏ నిధుల సద్వినియోగం కోసం డిమాండ్.

### కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు ఎందుకు..

**6 గ్యారెంటీల ప్రభావం:** రైతు భరోసా కింద 15,000,



ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు గూడేల్లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో అందని పోడు పట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగవంతం చేయడం ఆదివాసీల్లో నమ్మకం పెంచింది.

**స్థానిక నాయకత్వం:** ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదివాసీ బిడ్డగా, మావోయిస్టు నుంచి మంత్రిగా ఎదిగిన తీరు ప్రజలకు కనెక్ట్ అయింది. వరదల సమయంలో, జాతర నిర్వహణలో ఆమె చొరవ గ్రామాల్లో బలమైన ముద్ర వేసింది.

**బీఆర్ఎస్. బీజేపి బలహీనత:** పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో ములుగుకు మెడికల్ కాలేజీ రాలేదు, ఏజెన్సీ రోడ్లు అధ్వాన్నంగానే ఉన్నాయి అనే వ్యతిరేకత. బీజేపి కి స్థానిక కేడర్ లేకపోవడం, గిరిజన వ్యతిరేక ముద్ర కాంగ్రెస్‌కు కలిసొస్తోంది.

### గ్రౌండ్ రిపోర్ట్..

ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి మండలాల్లో పర్యటిస్తే వినిపిస్తున్న మాట ఒక్కటే ఈసారి చెయ్యి గుర్తుకే ఓటు. 2018లో స్వల్ప తేడాతో ఓడిన కాంగ్రెస్, 2023లో భారీ మెజార్టీతో గెలవడానికి కారణం ఆదివాసీ డిక్లరేషన్ అమలుపై ఉన్న భరోసానే. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సమ్మక్క-సారలమ్మ జాతరకు ?300 కోట్లు, ములుగు మెడికల్ కాలేజీ మంజూరు, పోడు భూములకు పట్టాలు ఇవ్వడం కాంగ్రెస్‌పై నమ్మకాన్ని రెట్టింపు చేసింది. ములుగు ప్రజల నినాదం స్పష్టం. అభివృద్ధి, ఆత్మగౌరవం, ఆదివాసీ హక్కులు. ఈ మూడింటిని గ్యారెంటీగా ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ వైపే ప్రస్తుతం మొగ్గు కనిపిస్తోంది. రానున్న స్థానిక ఎన్నికల్లోనూ ఈ గాలి కొనసాగితే ములుగు గడ్డపై హస్తం జెండా రెపరెపలాడడం ఖాయం.

# ప్రతిరోజూ యోగా చేయండి, ఆరోగ్యంగా జీవించండి





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా శాశ్వత పరిష్కారమని యోగా గురువు ఆలే సత్తయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం యోగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్యారేడ్ గ్రౌండ్, తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, లక్ష్మేశ్వర్ టెంపుల్ ప్లేగ్రౌండ్, మిత్ర క్లబ్, విక్టోరియా ప్లేగ్రౌండ్, నడికుడా ఫామ్ హౌస్ యోగ సెంటర్, ప్రభుత్వ గురుకుల వసతిగృహం తదితర ప్రాంతాల్లో వందలాది మంది యోగ సాధకులు పాల్గొని ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ యోగ ప్రచారకుడు అల్లే సత్తయ్య మాట్లాడుతూ “ప్రతిరోజూ కనీసం అరగంట యోగా చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని తెలిపారు. పతంజలి దక్షిణ జిల్లా అధ్యక్షుడు అనిల్ జీ, యువభారత్ నాయకుడు నరే చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగ గురువులు వినయ్ కుమార్, రమేష్, మారుతీరావు, కృష్ణ, దామోదర్ రెడ్డి, రామకృష్ణ, నవీన్ కుమార్ పాల్గొని యోగ ప్రాధాన్యతను వివరించారు.దక్షిణ జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో నిరంతరం ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ యోగను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగ శిక్షణపై ఆసక్తి ఉన్నవారు 94909 95238 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# గజ్వేల్‌లో శ్రీ వారాహి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఆర్గానిక్ షాప్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణంలోని పిడిచేట్ రోడ్‌లో శివాజీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ వారాహి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఆర్గానిక్ షాప్‌ను బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాప్ నిర్వాహకుడు చిట్యాల దినేష్ రెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. షాప్‌లో కోల్డ్ ప్రెస్ పల్లి నూనె, పొద్దుతిరుగుడు నూనె, కుసుమ నూనె, నువ్వుల నూనె, కొబ్బరి నూనెతో పాటు వివిధ రకాల పిండి పదార్థాలు, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణ కోసం కెమికల్స్ కలిగిన పదార్థాలకు దూరంగా ఉండి, ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. గజ్వేల్‌లో ఇలాంటి ఆర్గానిక్ షాప్ ప్రారంభం కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, తాజా మాజీ ఎంపీటీసీ హరిత సంతోష్ రెడ్డి, కౌన్సిలర్లు అత్తెలి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కాముని మురళి, మాజీ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, రహీం, చీర్ల మల్లేశం, ఆర్కే శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోయినిపల్లి మండలంలో అకాల వర్షం బీభత్సం

**- విద్యుత్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే సత్యం ఆదేశాలు జారీ**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని పలు గ్రామాల్లో భారీ గాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే రేకుల షెడ్లు దెబ్బతిని, రేకులు గాల్లోకి ఎగిరిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిపై చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం తక్షణమే స్పందించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత విద్యుత్ శాఖ ఎస్.ఈ.ని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు.

## మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలపై

# కాంగ్రెస్ వైఫల్యం స్పష్టమైంది

- **రూ.5.04 లక్షల పరిహారం ఏమైంది?**
- **ఎన్నికల హామీలు ఎక్కడ? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత**
- **హామీలు అమలు చేయకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పాలి**
- **నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
- **బీఆర్ఎస్ జిల్లా నాయకులు,నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మానుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల హామీల అమలుపై ప్రజలకు వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు,నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ అన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో మిడ్ మానేరు నిర్వాసితులకు రూ.5,04,000 అదనపు పరిహారం అందిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి చాలా కాలం గడిచినా ఆ హామీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా,ఇప్పుడు ప్రతిపక్షంపై విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపుల విషయంలో అనేక చర్యలు చేపట్టిందని భాస్కర్ గుర్తు చేశారు. ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడిందన్నారు. నేడు నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, అయితే సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం, ఉపాధి అవకాశాలు,మౌళిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నికల హామీలను మర్చిపోలేదని, ముఖ్యంగా అదనపు పరిహారం అంశంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని,లేని యెడల నిర్వాసిత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని భాస్కర్ డిమాండ్ చేశారు. నిర్వాసితుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, రాజకీయ విమర్శలతో కాలం గడపవద్దని సూచించారు.

# ఆరేళ్ల కఠోర శ్రమకు ఫలితం

**బ్లాక్ బెల్ట్ డిప్లమా సాధించిన ములుగు అమ్మాయి విజ్ఞశ్రీ**

**సీఎం కప్‌తో సహా పలు పోటీల్లో పతకాలు..**

**అంతర్జాతీయ స్థాయే లక్ష్యమన్న కరాటే క్రీడాకారిణి**



ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్ )కరాటే రంగంలో ములుగు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ అలువాల విజ్ఞశ్రీ బ్లాక్ బెల్ట్ డిప్లమాను సొంతం చేసుకుంది. శనివారం ఏటూరు నాగారం కరాటే అకాడమీలో జరిగిన బెల్ట్ పరీక్షలో అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఈ అరుదైన ఘనతను విజ్ఞశ్రీ అందుకుంది. గత ఆరు సంవత్సరాలుగా కరాటేలో శిక్షణ పొందుతున్న విజ్ఞశ్రీ, క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరుగా నిలిచింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పాల్గొని పథకాలు సాధించింది. ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక సీఎం కప్ పోటీల్లో ఆమె ప్రదర్శన అందరి ప్రశంసలు అందుకుంది. నిరంతర సాధనతో క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్న విజ్ఞశ్రీకి, నేడు సాధించిన బ్లాక్ బెల్ట్ డిప్లమా కెరీర్‌లో కీలక మైలురాయిగా నిలిచింది.

### పరీక్షలో అన్ని విభాగాల్లో ప్రతిభ..

బెల్ట్ పరీక్షలో భాగంగా కటా, కూమిటే, ఫిజికల్ ఫిట్నెస్, టెక్నికల్ స్కిల్స్ విభాగాల్లో విజ్ఞశ్రీ అద్భుత ప్రదర్శన చేసినట్లు శిక్షకులు వెల్లడించారు. బ్లాక్ బెల్ట్ స్థాయికి కావాల్సిన అన్ని ప్రమాణాలను ఆమె అందుకుందని, ఆమెలోని క్రమశిక్షణ, అంకితభావం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

### ప్రముఖుల ప్రశంసలు..



ములుగు జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బు గారు విజ్ఞశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. విజ్ఞశ్రీ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపై దేశానికి పేరు తీసుకురావాలి. అని ఆయన ఆకాంక్షించారు. కోచ్ హుస్సేన్ మాట్లాడుతూ, విజ్ఞశ్రీ విజయం వెనుక ఆమె కఠోర శ్రమ, శిక్షణ పట్ల చూపిన నిబద్ధత ఉంది. ప్రతి సెషన్‌ను ఎంతో చిత్తశుద్ధితో పూర్తి చేసేది" అని కొనియాడారు.

### లక్ష్యం అంతర్జాతీయ పతకాలే

తన విజయం పట్ల స్పందించిన విజ్ఞశ్రీ, నా విజయానికి మా అమ్మానాన్నల ప్రోత్సాహం, కుటుంబ సహకారం, గురువుల మార్గదర్శకతే ప్రధాన కారణం" అని తెలిపింది. ఈ బ్లాక్ బెల్ట్ డిప్లమాను మరింత కృషికి ప్రేరణగా తీసుకుంటానని చెప్పింది. భవిష్యత్తులో ఉన్నత స్థాయి బ్లాక్ బెల్ట్ డిగ్రీలు సాధించడంతో పాటు, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పతకాలు గెలవడమే నా లక్ష్యం" అని విజ్ఞశ్రీ ధీమా వ్యక్తం చేసింది. విజ్ఞశ్రీ సాధించిన ఈ ఘనతతో ములుగు జిల్లా కరాటే వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. చిన్న వయసులోనే బ్లాక్ బెల్ట్ సాధించడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## బ్యాంక్ మేనేజర్, బీజేపీ జిల్లా నాయకుడే

# ఇలా దౌర్జన్యం చేయడమేంది.?

**జగదేవ్‌పూర్‌లో సామాన్య రైతుల ఆగ్రహం**







గజ్వేల్ (ప్రశ్న న్యూస్) చట్టాన్ని గౌరవించాల్సిన ఉన్నత పదవుల్లో ఉన్నవారే సామాన్య మహిళా రైతుపై, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టుపై దౌర్జన్యానికి దిగడం తీవ్ర కలకలం రేపుతోంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన బోల్లు యాదవ్వ అనే మహిళా రైతుపై జరిగిన ఈ అన్యాయం పల్లెల్లో సామాన్యుల రక్షణను ప్రశ్నిస్తోంది. బాధిత మహిళా రైతు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిపల్లి గ్రామానికి చెందిన బోల్లు యాదవ్వకు మునిగడప రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 74 లో 2 ఎకరాల 30 గుంటల భూమి ఉంది. ఈ భూమిని ఆమె గత 40 ఏళ్లుగా నమ్ముకుని, సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే, ఆమె భూమి పక్కనే పొలం ఉన్న వట్టిపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రాజకీయ, అధికార బలంతో ఆమెపై దౌర్జన్యానికి దిగారు. వృత్తిరీత్యా డీసీసీబి (డీసీసీబీ) బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న కుడిక్యాల నాగభూషణం, ఆయన సోదరులైన బీజేపీ జిల్లా నాయకుడు కుడిక్యాల రాములు, తమ్ముడు పాండు కలిసి మహిళా రైతు భూమిలోకి అక్రమంగా చొరబడ్డారు. బాధిత మహిళా రైతు మొదటిసారి కందులు, అనంతరం రెండవ సారి వేసిన పత్తి పంట విత్తనాలను నిందితులు ట్రాక్టర్‌తో పలుమార్లు దున్నిస్తూ క్రూరంగా ధ్వంసం చేశారు. తాము ఎంతో కష్టపడి వేసిన పంటను నాశనం చేస్తుంటే.. ఇదేమని ప్రశ్నించినందుకు మహిళా రైతు కుమారుడు, స్థానిక జర్నలిస్ట్ అయిన సత్యనారాయణపై నిందితులు దుర్భాషలాడుతూ, భౌతిక దాడికి దిగి గాయపరిచారు. నిందితులు మరియు వారి మనుషుల వల్ల తమ ప్రాణాలకు ముప్పు ఉందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

### చట్టాన్ని రక్షించాల్సిన వారే దౌర్జన్యం చేస్తే ఎలా.?

బ్యాంక్ మేనేజర్, జిల్లా స్థాయి రాజకీయ నాయకుడి పేర్లు ఈ భూవివాదం మరియు దాడి ఘటనలో వినిపించడంతో స్థానిక రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. "చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ఉన్న ఉన్నత ఉద్యోగులు, రాజకీయ నాయకులే ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడితే, ఇక సామాన్య పేద రైతుల పరిస్థితి ఏమిటి?" అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఎస్ ఐ కృష్ణ రెడ్డి హెచ్చరిక :ఈ ఘోరంపై బాధిత మహిళా రైతు జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ ఐ కృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందించి, దౌర్జన్యం చేసిన వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో రౌడీయిజం, దౌర్జన్యాలు నడిపిస్తే ఊరుకునేది లేదని, ఎంతటి వారైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా బెదిరింపులు జరిగినా తక్షణమే 'డయల్ 100' కు ఫోన్ చేయాలని, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని సూచించారు. తమకు న్యాయం చేసేందుకు తక్షణమే స్పందించిన జగదేవ్‌పూర్ ఎస్ ఐ కృష్ణ రెడ్డికి, పోలీస్ సిబ్బందికి బాధిత మహిళా రైతు మరియు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి "ఛలో హైదరాబాద్"

- **ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి**
- **చెక్ పవర్ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**
- **ఫోరం నాయకుల డిమాండ్**
- **బోయినిపల్లిలో గోడప్రతి ఆవిష్కరణ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ఉపసర్పంచులు, వార్డు సభ్యుల హక్కుల సాధన కోసం ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపసర్పంచుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఉపసర్పంచుల మండల కమిటీ ఆధ్వర్యంలో "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతి (వాల్ పోస్టర్)నిఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ, ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపసర్పంచులకు నెలకు రూ.5,000, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ చేపట్టిన ధర్నాకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యక్షులు ఎర్రగడ్డ స్వామిరెడ్డి,కల్లెపల్లి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఎడపల్లి తిరుపతి, కోశాధికారి బాలగోని గోపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో

# అంతర్జాతీయ యోగా దినోత్సవం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐ క్యూ ఏ సి సహకారంతో, జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) యూనిట్-I, II ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే థీమ్‌తో కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏ సి సమన్వయకర్త ఎం.ఎం. లక్ష్మి మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక మరియు భావోద్వేగ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విషయ నిపుణుడిగా పాల్గొన్న చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి. జయరాజు యోగా ప్రాముఖ్యతను వివరించారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పలు యోగా ఆసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వివిధ యోగా ఆసనాలు, ధ్యానం, శ్వాసాభ్యాసాలు నిర్వహించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు ఏకాగ్రత పెంపొందించి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది చురుకుగా పాల్గొనడాన్ని అభినందించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి. సౌజన్య (యూనిట్-I), డా. కె. సరోజ (యూనిట్-II) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. వారి సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. యోగాను నిత్యజీవితంలో అలవాటు చేసుకొని ఆరోగ్యవంతమైన, సమతుల్య జీవనం గడపాలనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.



# 27 ఏళ్లలో ఒక్క హిందీ ఆఫర్ కూడా రాలేదు..


దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి జ్యోతిక తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో అగ్ర కథానాయికగా కొనసాగిన ఆమెకు 27 ఏళ్ల కెరీర్‌లో ఒక్క హిందీ సినిమా ఆఫర్ కూడా రాలేదని వెల్లడించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1998లో విడుదలైన 'దోలి సజా కె రఖ్నా' సినిమాతో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమైన జ్యోతిక, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అనంతరం ఆమె దక్షిణాది చిత్రసీమ వైపు అడుగులు వేసి, ముఖ్యంగా తమిళ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. అనేక సూపర్ హిట్, బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. అయితే అంతటి స్టార్‌డమ్, విజయాలు సాధించినప్పటికీ బాలీవుడ్ నుంచి తనకు అవకాశాలు రాకపోవడం వెనుక ఉన్న కారణాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో జ్యోతిక వెల్లడించారు. గత 27 ఏళ్లలో ఒక్కసారి కూడా హిందీ సినిమా కోసం నన్ను ఎవరూ సంప్రదించలేదు. చాలా మంది నేను బాలీవుడ్‌లో నటించకూడదని నిర్ణయించుకున్నానని భావించి ఉండొచ్చు. కానీ నిజానికి నాకు ఒక్క స్క్రిప్ట్ కూడా రాలేదు అంటూ జ్యోతిక ఆశ్చర్యకర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల 'సైతాన్', 'డబ్బా కార్టెల్' వంటి హిందీ ప్రాజెక్ట్‌లతో బాలీవుడ్‌లో మళ్లీ కనిపిస్తున్న జ్యోతిక, తనకు అవకాశాలు రావడం వెనుక మరో ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. తాను ముంబైకి మకాం మార్చిన తర్వాతే హిందీ అవకాశాలు రావడం ప్రారంభమైందని చెప్పారు. అయితే బాలీవుడ్‌లో కెరీర్‌ను కొనసాగించాలనే ఉద్దేశంతో తాను ముంబైకి వెళ్లలేదని, తన పిల్లలు మరియు తల్లిదండ్రుల కోసం అక్కడికి షిఫ్ట్ అయ్యానని జ్యోతిక తెలిపారు. "ముంబైకి వచ్చిన తర్వాత అనుకోకుండా హిందీ ప్రాజెక్ట్‌లు రావడం మొదలైంది" అని ఆమె పేర్కొన్నారు. ఇక ఉత్తరాది, దక్షిణాది సినీ పరిశ్రమల మధ్య గతంలో ఉన్న దూరం ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయిందని జ్యోతిక అభిప్రాయపడ్డారు.నార్త్, సౌత్ ఇండస్ట్రీల మధ్య ఉన్న గీతలు చెరిగిపోయాయి. రెండు పరిశ్రమలు ఇప్పుడు మరింత దగ్గరయ్యాయి. అందుకే ప్రస్తుతం నాకు హిందీ ప్రాజెక్ట్‌లు వస్తున్నాయని నేను భావిస్తున్నాను అని ఆమె చెప్పారు. జ్యోతిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో చోటు చేసుకుంటున్న మార్పులను ప్రతిబింబిస్తున్నాయని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకప్పుడు ప్రాంతీయ భాషలకే పరిమితమైన నటీనటులు ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు.

# ఉత్కంఠభరితంగా 'హ్రీం'



పవన్ తాతా, చమింద వర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'హ్రీం'. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రమ్ ఇతర పాత్రధారులు. రాజేశ్ రావూరి దర్శకుడు. శివ మల్లాల నిర్మాత. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి టీజర్‌ని ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'దర్శకుడు రాజేశ్ చెప్పిన కర్ణపిశాచి కథలోని కోర్ పాయింట్ నాకు బాగా నచ్చింది. టీమ్ అంతా సపోర్ట్ చేయడం వల్లే ఈ సినిమాను చేయగలిగాను. సినిమాలోని 20 నిమిషాల గ్రాఫిక్స్ అద్భుతమైన అనుభూతినిస్తాయి' అని నిర్మాత శివ మల్లాల తెలిపారు.

టీమ్ అంతా మక్కువతో చేసిన సినిమా ఇదని, దర్శకుడిగా తనకు అవకాశం ఇచ్చిన శివ మల్లాలకు కృతజ్ఞతలని దర్శకుడు రాజేశ్ రావూరి అన్నారు. ఇంకా చిత్రబృందంతోపాటు జర్నలిస్ట్ ప్రభు, డైరెక్టర్ వరుణ్‌రెడ్డి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్, సంగీతం: మార్కస్.ఎం.



# రైజ్ ఆఫ్ లింగా

స్వీయ దర్శకత్వంలో విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మకుటం'. సముద్ర నేపథ్య కథాంశమిది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తున్న 99వ సినిమా ఇది. ఈ చిత్రంలో విశాల్ త్రిపాత్రాభినయంలో కనిపిస్తారని, హై ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. శనివారం మూడు పాత్రల్లో ఒకటైన లింగా ఫస్ట్‌లుక్‌ని పరిచయం చేస్తూ 'రైజ్ ఆఫ్ లింగా' అనే పాటను విడుదల చేశారు. దీనిని విశాల్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ సంయుక్తంగా ఆలపించారు. దుషార విజయన్, అంజలి, తంబి రామయ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కథ: రవి అరసు, నిర్మాత: ఆర్.బి.చౌదరి, దర్శకత్వం: విశాల్.

# సమంత సరికొత్త రికార్డ్...
# ఇక ఇది ఎవరు టచ్ చేయలేరేమో..!

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత మరోసారి తన స్టార్‌డమ్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపిస్తోంది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతూ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంటోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అమెరికా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకుపోతుండటంతో సమంత అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యూఎస్ మార్కెట్‌లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన సమంత తన ఖాతాలో ఎన్నో విజయాలను నమోదు చేసుకుంది. ఇప్పటికే యూఎస్ బాక్సాఫీస్ వద్ద 1 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించిన అత్యధిక చిత్రాలు కలిగిన హీరోయిన్‌గా సమంత రికార్డు సృష్టించింది. ఆమె నటించిన మొత్తం 16 సినిమాలు ఈ ఘనతను సాధించాయి. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' కూడా అదే జాబితాలో చేరేందుకు సిద్ధమైంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఈ సినిమా వీకెండ్ ముగిసే నాటికి సులభంగా 1 మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకోనుంది. దీంతో యూఎస్ బాక్సాఫీస్ వద్ద 17 మిలియన్ డాలర్ చిత్రాలను కలిగిన తొలి సౌత్ ఇండియన్ హీరోయిన్‌గా సమంత కొత్త రికార్డును తన పేరిట నమోదు చేసుకోనుంది. సమంత కెరీర్‌లో ఇది మరో కీలక




మైలురాయిగా సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న హీరోయిన్లలో ఓవర్సీస్ మార్కెట్‌లో ఇలాంటి విజయాలను అందుకున్న నటీమణులు చాలా తక్కువమంది మాత్రమే ఉన్నారు. అందుకే సమంత సాధిస్తున్న ఈ రికార్డును సమీప భవిష్యత్తులో మరెవరైనా అధిగమించడం కష్టమేనని ట్రేడ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక 'మా ఇంటి బంగారం' విజయంతో సమంత కెరీర్ మరోసారి ఊపందుకున్నట్లు కనిపిస్తోంది. కథా ప్రధానమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్న సమంత, ఈ సినిమాతో కూడా తన నటనకు ప్రశంసలు అందుకుంటోంది. సినిమా కలెక్షన్లు ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు నమోదు కావడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 1990 దశకం నాటి
# 'కామ్రేడ్ కల్యాణ్'



శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992 ఆంధ్ర-ఒరిస్సా నేపథ్యంలో జరిగే కథ ఇది. శనివారం ఈ సినిమా నుంచి 'ఒరియా పిల్ల..' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. 'కామ్రేడ్ కల్యాణ్' తాలూకు రొమాంటిక్ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఈ పాట సాగింది. విజయ్ బుల్గానిన్ మెలోడీ ప్రధానంగా చక్కటి బాణీని సమకూర్చారు.భాస్కరభట్ల సాహిత్యం ప్రధానాకర్షణగా నిలిచింది. ఈ సినిమా కోసం 1990 దశకంలో జరిగిన యథార్థ సంఘటనలకు కాల్పనిక అంశాలను జోడించి కోన వెంకట్ అద్భుతమైన కథను తయారుచేశారని, ఇందులో తాను ఓ కొత్త భాషలో మాట్లాడానని, అదేమిటో తెరపై చూసి తెలుసుకోవాలని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉందని రచయిత, నిర్మాత కోన వెంకట్ పేర్కొన్నారు. సినిమాలోని నాలుగు పాటలు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు జానకిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ధనుష్-మృణాల్ ప్రేమకథకు బ్రేక్ పడిందా..
## నెట్టింట చక్కర్లు కొడుతున్న బ్రేకప్ వార్తలు





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ సాగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా ఉండడం వంటి అంశాలు ఈ రూమర్లకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ జంట విడిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.గత ఏడాది ఆగస్టులో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్ షోలో ధనుష్, మృణాల్ కలిసి కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. అనంతరం ధనుష్ నటించిన 'తేరే ఇష్క్ మే' సినిమా పార్టీకి కూడా మృణాల్ హాజరుకావడం ఇద్దరి మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉందనే చర్చలకు దారి తీసింది. అంతేకాకుండా, మృణాల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ధనుష్ సోదరీమణులు డాక్టర్ కార్తీక, విమలా గీతలను ఫాలో అవ్వడం కూడా ఈ ప్రేమ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కూడా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ రూమర్లపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ నాకు మంచి స్నేహితుడు మాత్రమే అని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలు కూడా పుకార్లకు పూర్తిగా తెరదించలేకపోయాయి. ఇదిలా ఉంటే, ఈ ఇద్దరికీ సన్నిహితంగా ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం వారు నిజంగానే డేటింగ్ చేస్తున్నారని, కానీ ఆ సంబంధం ప్రారంభ దశలోనే ఉందని పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఇద్దరికీ ఒకే విధమైన ఆలోచనలు, విలువలు ఉండడంతో ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటున్నారని, అయితే తమ వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచాలని కోరుకుంటున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా కొన్ని సినీ వర్గాల కథనాల ప్రకారం ధనుష్, మృణాల్ మధ్య దూరం పెరిగిందని, ఇద్దరూ విడిపోయారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వీరి మధ్య విభేదాలకు గల కారణాలేమిటన్నది ఇప్పటివరకు బయటకు రాలేదు. మరోవైపు ఈ బ్రేకప్ వార్తలపై ఇప్పటి వరకు అటు ధనుష్ గానీ, ఇటు మృణాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందన్నది ఇంకా స్పష్టత రాలేదు. ధనుష్ గతంలో సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు. దాదాపు 18 సంవత్సరాల వైవాహిక జీవితానంతరం 2022లో ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి యాత్ర, లింగ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఎడారిని తలపిస్తున్న మధ్య మానేరు జలాశయం

- కేసీఆర్ కృషితో నాడు జలకళ ...! నేడు విలవిల...!!
- మిడ్ మానేరు ఎండిపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే : సుంకె రవిశంకర్
- కబడ్డీ, క్రికెట్ ఆడిన బీఆర్ఎస్ నేతలు



బోయినపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినపల్లి మండలంలోని కొదురుపాక మధ్య మానేరు జలాశయం ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయాన్ని సందర్శించిన ఆయన, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడంతో నీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు.నాడు కేసీఆర్ కృషితో జలకళ గా ఉన్న మధ్య మానేరు జలాశయం కాంగ్రెస్ హయాంలో విలవిలలాడుతుందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేపట్టి, కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎండిపోయిన మిడ్ మానేరు ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి కబడ్డీ, క్రికెట్ ఆడారు.

# యోగాకు ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చిన ప్రధాని మోదీ

- బీజేపీ మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం
- బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



బోయినపల్లి (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బోయినపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌తో పాటు వెంకట్రావుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, స్వామి కుమార్, పెంచల మహేష్, అమెరిశెట్టి గంగయ్య, యువమోర్చా మండల అధ్యక్షుడు మిర్యాల శరత్ చంద్రారెడ్డి, చిలుముల రమేష్, గుంటి ఆంజనేయులు, కొత్తకొండ రమేష్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యోగా గురువులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కటాస్, కుమిటేలో ప్రతిభ... బ్లాక్ బెల్ట్ సాధించిన దూలం యశ్వంత్

- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి యశ్వంత్
- యశ్వంత్ విజయం పై అభినందనల వెల్లువ




వేములవాడ (ప్రశ్న న్యూస్) మార్షల్ ఆర్ట్స్ రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడకు చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి దూలం యశ్వంత్ విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక బ్లాక్ బెల్ట్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, కరాటే సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు.కరీంనగర్‌లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో యశ్వంత్ పాల్గొన్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, మాస్టర్ అబ్దుల్ మన్నాన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న యశ్వంత్, కరాటేలో కీలకమైన కటాస్, కుమిటే విభాగాల్లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి పరీక్షకుల ప్రశంసలు అందుకున్నాడు.ఈ సందర్భంగా ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ చేతుల మీదుగా యశ్వంత్‌కు బ్లాక్ బెల్ట్‌తో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. కరాటేలో ఉన్నత స్థాయి నైపుణ్యానికి గుర్తింపుగా లభించే ఈ బ్లాక్ బెల్ట్ సాధించడం గర్వకారణమని నిర్వాహకులు పేర్కొన్నారు.యశ్వంత్ విజయాన్ని పురస్కరించుకుని ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షులు కొండ దేవయ్య, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు కొమురవెల్లి భూమేష్, చింతకుంట తిరుపతి తదితరులు పాల్గొని యశ్వంత్‌ను అభినందించారు.

# జయశంకర్ స్ఫూర్తితో సామాజిక న్యాయం సాధించాలి

- బీసీ సాధికారత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జి : పొలాస నరేందర్
- బీసీ సాధికారత సంఘం ఆధ్వర్యంలో ప్రొ. జయశంకర్ కు నివాళులు



వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ భావజాలానికి మార్గదర్శకుడిగా నిలిచిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జి పొలాస నరేందర్ ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వర్గాలకు సముచిత హక్కులు సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని నరేందర్ పేర్కొన్నారు.

# ఏళ్లకూ ఫిట్ గా...! యోగాతో స్ఫూర్తిగా నిలిచిన అనుమల్ల చంద్రమౌళి..!!

- ప్రపంచానికి యోగా గొప్పదనాన్ని చాటిన ప్రధాని మోదీ
- యోగాతో ఆరోగ్యం - ఆరోగ్యంతో ఆనందం
- బీజేపీ సీనియర్ నేత : అనుమల్ల చంద్రమౌళి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా సీనియర్ నేత, సామాజిక వేత్త అనుమల్ల చంద్రమౌళి ప్రస్తుతం వేసవి స్వల్ప విరామం కోసం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వెళ్లినా, యోగా విశిష్టతను తెలియజేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే గొప్ప భారతీయ సంప్రదాయమని, 70 ఏళ్ల వయసులోనూ తాను నిత్యం యోగా చేస్తూ దానిని దినచర్యలో భాగం చేసుకున్నానని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్రమోదీ చొరవతో యోగాకు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు లభించిందని, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించడం భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని, యోగా ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. యువతతో పాటు అన్ని వయసుల వారు యోగాను అలవాటు చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని చంద్రమౌళి పిలుపునిచ్చారు. "యోగాతో ఆరోగ్యం, ఆరోగ్యంతో ఆనందం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయ సాధనకు సంఘటితంగా ముందుకు సాగుదాం

- విశ్వబ్రాహ్మణుల ఐక్యతే లక్ష్యం దిశగా పని చేస్తా
- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం నూతన మండలాధ్యక్షులు :పాలోజు జగదీశ్వర చారి
- ఆచార్య జయశంకర్‌కు నివాళులతో విశ్వకర్మ సంఘం ప్రమాణ స్వీకారం



బోయినపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండల విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ ఐక్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం, పూర్వ మండలాధ్యక్షులు ఉదారి నరసింహాచారి, వేములవాడ కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు హాజరయ్యారు. సంఘం నూతన అధ్యక్షులుగా పాలోజు జగదీశ్వర చారి, ఉపాధ్యక్షులుగా మొగులోజి లక్ష్మీరాజం, బూరుగుపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా ఎదులాపురం ప్రభాకర చారి, కోశాధికారిగా భోగోజి గంగాధర్ చారి, గౌరవాధ్యక్షులుగా పుప్పాల దేవయ్య,ముఖ్య సలహాదారులుగా భోగోజి భూమయ్య, భోగోజి ఆంజనేయులు, కార్యదర్శులుగా చిలుమెల రమేష్,నాగసముద్రం లక్ష్మణ్, రాజూరి రాములు, కార్యవర్గ సభ్యులుగా భోగోజి ప్రసాద్, బూరుగుపల్లి రమేష్ ,ఉదారి రమేష్, మొగులోజి లక్ష్మీనారాయణ, వెంకటాచారి, ఎనుగంటి లక్ష్మీనారాయణ, అక్కపల్లి శంకరయ్య, ఎనుగంటి మురళి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పాలోజు జగదీశ్వర చారి మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సమాజ అభ్యున్నతే సంఘం ప్రధాన లక్ష్యమని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల విశ్వకర్మ కుటుంబాలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సంప్రదాయ వృత్తుల పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరుతూ,తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆచార్య జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

# కీసర సెరినిటి పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




కీసర (ప్రశ్న న్యూస్) కీసర మండలంలోని కీసర సెరినిటి పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణలో దాని పాత్ర గురించి పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోనో వివరించారు.యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పీ.ఈ.టి. ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ యోగా ఆసనాలను అభ్యసించి తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోనో, ప్రిన్సిపాల్ మధుసూదన్, అడ్మినిస్ట్రేటర్ సునీల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు.

# నిర్వాసితులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు

- మిడ్ మానేరు అంశంలో బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి
- కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు : కూస రవీందర్




బోయినపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలం, కొదురుపాక శ్రీ రాజరాజేశ్వర మధ్య మానేరు జలాశయం నిర్వాసితుల సమస్యలపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిర్వాసిత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదని, పరిహారం విషయంలో అనేక కుటుంబాలు నష్టపోయాయని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ వేలాది కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. మిడ్ మానేరు జలాశయం పరిస్థితిని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని, రైతులు, నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. గత పాలనలో జరిగిన తప్పిదాలను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని కూస రవీందర్ పేర్కొన్నారు.

# గజ్వేల్ బస్ స్టాండ్లు, రింగ్ రోడ్డును వెంటనే వినియోగంలోకి తేవాలి

బి.వి.రావు పంతులు





గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రాంతంలో నిర్మాణం పూర్తయినప్పటికీ వినియోగంలోకి రాని బస్ స్టాండ్లు, రింగ్ రోడ్డును వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని బి.వి.రావు పంతులు కోరారు.గజ్వేల్–తూప్రాన్ ప్రధాన రహదారిపై నిర్మించిన ఆధునిక బస్ స్టాండ్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించడంతో పాటు, రాజీవ్ రహదారిపై ఉన్న ప్రజ్ఞాపూర్ బస్ స్టాండ్‌ను కూడా వెంటనే అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గజ్వేల్––ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డును ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని ముఖ్య ఎక్స్‌ప్రెస్ బస్సులు గజ్వేల్ మీదుగా నడిచేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.బి.వి.రావు పంతులు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు గజ్వేల్‌ను ఆధునిక రవాణా కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ బస్ స్టాండ్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. ప్రతిపాదిత బస్ స్టాండ్‌లో 24 ప్లాట్‌ఫారమ్‌లు, ఉడిపి హోటల్, వెజ్––నాన్‌వెజ్ రెస్టారెంట్, 50 సీట్ల మినీ థియేటర్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉండేలా రూపకల్పన చేశారని పేర్కొన్నారు.హైదరాబాద్, తూప్రాన్, భువనగిరి, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులన్నీ రింగ్ రోడ్డు మీదుగా గజ్వేల్‌కు చేరి తమ గమ్యస్థానాలకు వెళ్లే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అయితే బస్ స్టాండ్ స్థలానికి సంబంధించి కోర్టు కేసు ఉండటంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని, కేసు పరిష్కారం అనంతరం పనులు చేపట్టినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం బాధాకరమని అన్నారు.తూప్రాన్ రోడ్డులోని బస్ స్టాండ్, గజ్వేల్ పట్టణ నడిబొడ్డున ఉన్న బస్ స్టాండ్, రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ బస్ స్టాండ్–ఈ మూడు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తే గజ్వేల్ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అభిప్రాయపడ్డారు.ప్రయాణికుల సౌకర్యార్థం, ప్రాంతీయ అభివృద్ధి దృష్ట్యా బస్ స్టాండ్లు, రింగ్ రోడ్డును తక్షణమే వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను బి.వి.రావు పంతులు కోరారు.

# పేరుకే 'పురపాలక'.. ప్రయాణికులకు నరకప్రాయం

- ఎల్లంపేట పురపాలక పరిధిలో అధ్వాన్నంగా బస్టాండ్ దుస్థితి
- కూర్చోవడానికి సీట్లు లేవు.. చెత్తాచెదారంతో అపరిశుభ్రం
- నెలలు గడుస్తున్నా అడ్రస్ లేని బస్సులు.. కమిషనర్ ఉన్నట్టా? లేనట్టా.?
- కూలిపోయే స్థితిలో రేకుల షెడ్డు.. నిలబడటమే శాపం
- డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పరిసరాలు
- పురపాలక సంఘం ఏర్పాటైనా బస్సుల్లేవు.. కమిషనర్ నిర్లక్ష్యంపై ఆగ్రహం






మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) గ్రామం నుండి పురపాలక సంఘంగా రూపాంతరం చెందితే తమ బతుకులు మారుతాయని, మౌలిక వసతులు మెరుగవుతాయని ఆశించిన ఎల్లంపేట ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. పాలకులు, అధికారులు మారినా ఇక్కడి సమస్యలు మాత్రం పాతగీతనే పాడుతున్నాయి. పురపాలక సంఘం పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. కనీస సౌకర్యాలకు నోచుకోని ఈ బస్టాండ్, ప్రస్తుతం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెడుతోంది.

### కూలిపోయే స్థితిలో రేకుల షెడ్డు, నిలబడటమే శాపం..

ఎల్లంపేట బస్టాండ్ కనీసం నిలబడటానికి కూడా వీల్లేని విధంగా అత్యంత దారుణంగా మారింది. తుప్పుపట్టి, వంగిపోయిన ఇనుప స్తంభాలపై ఒక పాత రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ఆ షెడ్డు పైకప్పు రేకులు సైతం ఊడిపోయి, ఏ క్షణంలోనైనా ప్రయాణికులపై కూలిపోయే ప్రమాదం పొంచివుంది. మరీ ముఖ్యంగా, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూసే ప్రయాణికులు, వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు కూర్చోవడానికి ఇక్కడ కనీసం ఒక్క సీటు లేదా బెంచి కూడా అందుబాటులో లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రమైన ఎండకు, వానకు తడుస్తూ అల్లాడిపోతున్నారు.

### డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పరిసరాలు..

బస్టాండ్ ఆవరణ మొత్తం పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతోంది. బస్టాండ్ వెనుక భాగం మరియు పక్కలంతా ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిపోయి ఒక చిన్నపాటి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో దోమలు, ఈగలు చేరి రోగాలకు నిలయంగా మారుతోంది. పురపాలక సంఘంగా మారిన తర్వాత కూడా పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

### పురపాలక సంఘం ఏర్పాటైనా బస్సుల్లేవు..

### కమిషనర్ నిర్లక్ష్యంపై ఆగ్రహం..

ఎల్లంపేట పురపాలక సంఘం ఏర్పడి నెలలు గడుస్తున్నా.. ఇక్కడి ప్రజల రవాణా కష్టాలు తీరలేదు. పేరుకే పురపాలక సంఘం తప్ప, కనీసం నిరంతరం నడిచే బస్సు సౌకర్యం కూడా కల్పించడంలో ఆర్టీసీ డిపో అధికారులు, స్థానిక యంత్రాంగం ఘోరంగా విఫలమయ్యారు. ఆటోలను ఆశ్రయించి ప్రయాణికులు జేబులు గుల్ల చేసుకోవాల్సివస్తోంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. అసలు పురపాలక సంఘానికి కమిషనర్ ఉన్నట్టా.? లేనట్టా.? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో కూర్చోవడం తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఎల్లంపేట బస్టాండ్ ఇంతలా రూపురేఖలు కోల్పోయిందని మండిపడుతున్నారు.

# లక్షల ఆదాయం.. వసతుల్లో మాత్రం శూన్యం

- నూతన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో 'నరకయాతన'
- కనీసం మూత్రశాలలు, తాగునీరు లేక మహిళలు, వృద్ధుల తీవ్ర అవస్థలు
- స్వచ్ఛ భారత్ నినాదాల ముందే వెక్కిరిస్తున్న దుస్థితి
- మహిళల పరిస్థితి వర్ణనాతీతం
- తక్షణమే స్పందించాలి.. మార్పు రావాల్సిందే
- వేలల్లో ఫీజులు వసూలు చేస్తారు.. ?

కనీస సౌకర్యాలు కల్పించరా.? బండి విష్ణుమూర్తి



మేడ్చల్( ప్రశ్న న్యూస్) ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించే కామధేనువు లాంటి కార్యాలయం అది. నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు.. ఖజానాకు రోజువారీగా లక్షలాది రూపాయల ఆదాయం. కానీ అక్కడికి వచ్చే సగటు పౌరుడికి మాత్రం నరకమే ఎదురవుతోంది. నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం కనీస వసతులు లేక 'సమస్యల



నిలయం'గా మారింది. "ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. మా ప్రాథమిక అవసరాలపై లేదా.? అంటూ కార్యాలయానికి వస్తున్న ప్రజలు అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు.

### మహిళల పరిస్థితి వర్ణనాతీతం..

ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాలు, వివాహ నమోదుల కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఇక్కడికి వందలాది మంది మహిళలు, పురుషులు, వృద్ధులు వస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి గంటల సమయం పడుతోంది. అయితే, ఈ కార్యాలయంలో కనీసం ఒక్క మూత్రశాల కూడా అందుబాటులో



లేకపోవడం అత్యంత దారుణం. పురుషులు ఎట్టకేలకు బయట బహిరంగ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నా మహిళల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తీవ్రమైన ఇబ్బందిని భరిస్తూ గంటల తరబడి నరకయాతన అనుభవిస్తున్నారు. డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్ అంటూ మైకుల్లో చెప్పే ప్రభుత్వాల ముక్కు ముందే ఈ దుస్థితి దాగి ఉండటం గమనార్హం.

### గొంతు ఎండాల్సిందేనా.?

తీరని మూత్రశాలల ఇబ్బంది ఒకవైపు ఉంటే, కనీసం తాగడానికి గుక్కెడు తాగునీటి సదుపాయం కూడా ఈ కార్యాలయంలో మృగ్యమైంది. సుదూర ప్రాంతాల నుండి ఎండనక, వాననక వచ్చే ప్రజలు నీళ్ల బాటిళ్ల కోసం బయట ప్రైవేట్ దుకాణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. రూ. లక్షల స్టాంప్ డ్యూటీలు వసూలు చేస్తున్న యంత్రాంగానికి, ప్రజల కోసం ఒక వాటర్ కూలర్ పెట్టే తీరిక, ఓపిక లేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### తక్షణమే స్పందించాలి.. మార్పు రావాల్సిందే



నూతన కార్యాలయం కాబట్టి తాత్కాలికంగా ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెప్పున్న కుంటిసాకులు ఇక చెల్లవు. నిత్యం ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చిపెట్టే ఈ కేంద్రంలో యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలి. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ఇక్కడ శాశ్వత మూత్రశాలలను నిర్మించడంతో పాటు, తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

### వేలల్లో ఫీజులు వసూలు చేస్తారు..

### కనీస సౌకర్యాలు కల్పించరా.? బండి విష్ణుమూర్తి

కొత్త ఆఫీస్ కదా అని ఎంతో ఆశతో వచ్చాం. కానీ ఇక్కడ కనీసం వాష్ రూమ్ కూడా లేకపోవడం ఏంటి.? రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో మా దగ్గర వేల రూపాయలు వసూలు చేస్తున్నారు కదా.. మరి మాకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులకు లేదా.? ప్రభుత్వానికి రోజుకు లక్షల్లో ఆదాయం వస్తున్నా, ఇక్కడికి వచ్చే ప్రజల కోసం కనీసం ఒక మూత్రశాల, తాగునీరు ఏర్పాటు చేయకపోవడం అధికారుల ఘోర నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

# బోర్డు మార్చడానికి పైసల్లేవా.?

- నల్ల రంగు వేయడమేనా మీ పరిష్కారం.?
- గ్రామపంచాయతీ పేరుపై నల్లరంగు పూసిన అధికారులు
- అక్రమ నిర్మాణాలపై ఉన్న శ్రద్ధ,

సూచిక బోర్డులపై లేదని ప్రజల ఆగ్రహం

- కొత్త బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట గ్రామ పంచాయతీ పురపాలక సంఘంగా రూపాంతరం చెంది నెలలు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పాత బోర్డులనే కొనసాగించడంపై 'నేడు' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పాత గ్రామపంచాయతీ బోర్డును అలాగే ఉంచి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న తీరుపై పత్రికలో వచ్చిన వార్తతో కదిలిన పురపాలక అధికారులు రాత్రికి రాత్రే సదరు సూచిక బోర్డుపై ఉన్న "గ్రామపంచాయతీ" అనే పాత పేరుపై నల్ల రంగు పూసి చేతులు దులుపుకున్నారు.

### నల్ల రంగు వేయడమేనా మీ పరిష్కారం.?

అధికారుల తాత్కాలిక చర్యలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో పాత బోర్డులను తొలగించి, కొత్త పురపాలక బోర్డులను ఏర్పాటు చేయడానికి కనీసం నిధులు లేవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చూపించే శ్రద్ధ మరియు ఉత్సాహం.. ప్రభుత్వ అధికారిక సూచిక బోర్డులను మార్చడంలో ఎందుకు చూపించడం లేదు.? అని ప్రజలు బహిరంగంగానే నిలదీస్తున్నారు.




### కొత్త బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్..

కేవలం పాత పేరుపై నల్ల రంగు పూసి మభ్యపెట్టడం కాకుండా, తక్షణమే సదరు బోర్డు స్థానంలో ఎల్లంపేట పురపాలక సంఘానికి సంబంధించిన నూతన బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాలకవర్గం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పురపాలక హోదాకు తగ్గట్టుగా బోర్డులను ఆధునీకరించాలని, ప్రజల్లో ఉన్న అయోమయాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్

- గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీయడమే లీగ్ లక్ష్యమని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీజీ20 (టీజీ20) లీగ్ ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ వేడుక అంబరాన్నంటింది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ లీగ్ అట్టహాసంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా లీగ్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ తన లైవ్ పర్ఫార్మెన్స్‌తో స్టేడియాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ హైదరాబాద్, తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారని, వీవీఎస్ లక్ష్మణ్ తర్వాత ఆ స్థాయి ఖాళీ ఏర్పడిందని అన్నారు. ఈ టీజీ20 లీగ్ ద్వారా ఎంతో మంది యువ ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చి, ఐపీఎల్, టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ లీగ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఛాంపియన్స్ (ఈటీవీ భారత్) సహా పలు జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవం అనంతరం లీగ్‌లో మ్యాచ్‌లు కూడా మొదలయ్యాయి. తెలంగాణలోని యువ క్రీడాకారులకు ఇదొక సువర్ణావకాశమని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ఈ లీగ్ నిర్వహణపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, హెచ్‌సీఏ మాత్రం ఈ టోర్నీని విజయవంతంగా ముందుకు నడిపిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీజీ20 లీగ్‌కు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉండి, అవకాశాలు రాని యువతకు ఇది ఒక గొప్ప వేదిక అని ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని భట్టి వివరించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, వారిని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# తమిళనాడులో ఘోర ప్రమాదం


- అమ్మోనియా వాయువు లీకై ఏడుగురి మృతి



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

# నీట్ విద్యార్థుల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ప్రధాని మోదీ

- పరీక్ష ప్రారంభమయ్యాకే తన నివాసానికి బయలుదేరిన వైనం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా తన అధికారిక నివాసానికి వెళ్లాల్సి ఉంది.అయితే, మధ్యాహ్నం 2 గంటలకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభం కానుండటంతో, తన కాన్వాయ్ కారణంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు ఇబ్బంది పడతారని ప్రధాని భావించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ఆయన విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత, అంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఆయన తన నివాసానికి బయలుదేరారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కట్టుదిట్టమైన భద్రత నడుమ నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా పరీక్ష రాయాలని సూచించారు. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, యువత భవిష్యత్తుతో ఆడుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588